తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
గురువారం
23 జూలై 2026

## జీరో యాక్సిడెంట్ జోన్‌గా మెదక్ లక్ష్యం

- జాతీయ రహదారులపై భద్రతకు ప్రత్యేక చర్యలు
- పాఠశాలల వద్ద వేగ నియంత్రికలు తప్పనిసరి
- ప్రజల ప్రాణ రక్షణే ప్రధాన లక్ష్యం
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





**మెదక్ బ్యూరో, జూలై 22( జనం సాక్షి):** మెదక్ జిల్లాను జీరో యాక్సిడెంట్ జోన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్, ఆర్అండ్‌బీ, నేషనల్ హైవే, పోలీసు శాఖ అధికారులతో నిర్వహించిన రహదారి భద్రత సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, బ్లాక్‌స్పాట్లను గుర్తించి సీసీ కెమెరాలు, లైటింగ్, బారికేడ్లు, రేడియం స్టిక్కర్లు, రంబుల్ స్ట్రిప్స్, సైనేజీలు, మీడియన్ బ్యారియర్లు వంటి భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. అక్రమ పార్కింగ్, ఆక్రమణలు, అనుమతి లేని నిర్మాణాలు, ఫ్లెక్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం నేషనల్ హైవే టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వడియారం, రామాయంపేట జంక్షన్లలో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని, ప్రజల సురక్షిత ప్రయాణానికి అవసరమైన అన్ని పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే ఐ ఆర్ సి నిబంధనల మేరకు అన్ని పాఠశాలల సమీపంలో వేగ నియంత్రికలు, ప్రమాద హెచ్చరిక బోర్డులు, ఇతర రహదారి భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు, పాదచారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్‌హెచ్-163పై ఇప్పటికే పలు రహదారి భద్రతా పనులు పురోగతిలో ఉన్నాయని, ప్రజల ప్రాణ రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.

## సెప్టెంబర్ నెలాఖరు నాటికి భూ సేకరణ పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో జూలై 22(జనంసాక్షి):** మక్తల్ - నారాయణ పేట - కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపడుతున్న భూ సేకరణ ప్రక్రియను సెప్టెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్‌లో ఎంఎన్‌కేఎల్ భూసేకరపై రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనుతో కలిసి రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూభూ సేకరణ ప్రక్రియ కు సంబంధించి రెవెన్యూ అదనపు కలెక్టర్, ఆర్డీవో, ప్రత్యేక అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరగా పరిష్కరించాలన్నారు.

కాన్సెంట్ లు తీసుకుని అవార్డులు త్వరగా పూర్తి చేయాలన్నారు.సెప్టెంబర్ 30లోపు భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు.సాకులు చెప్పకుండా లక్ష్యాల ప్రకారం పని చేయాలన్నారు.అవసరమైతే ప్రత్యేక బృందాలు ఏర్పా టు చేయాలని,లక్ష్మీపూర్ ట్యాంక్ ప్రాంతానికి సంబం ధించిన పనులను ప్రాధా న్యంగా పూర్తి చేయాలని సూచించారు.ఆర్ఐలు తమ తమ పరిధిలో పట్టాల పరిశీలన చేసి, నాలుగు రోజుల్లో సర్వే పూర్తి చేయాలన్నారు. గుండుమల్, కోస్గి మండలాలలో భూ సేకరణ ప్రక్రి య వేగిరం చేయాలని ఆయా మండలాల తహసి ల్దార్ల ను ఆదేశించారు. మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి జిల్లాలోని ఆయా గ్రామాల్లో సేకరించాల్సిన భూ సేకరణ ను సెప్టెంబర్ నెలాఖరు లోపు పూర్తి చేయాలని ఆమె పున రుద్ఘాటించారు. ఈ సమీక్ష లో డీ ఆర్ వో రాజ్యలక్ష్మీ, ఆర్ డి ఓ రమేష్, ఎస్. డీ.సీ. రాజేందర్ గౌడ్, ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## జిల్లా పర్యాటక అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ బ్యూరో, జూలై 22 (జనంసాక్షి):** జిల్లా పర్యాటక అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. బుధ వారం కలెక్టర్లోని కలెక్టర్ ఛాంబర్ లో గత ఐదు రోజుల నుంచి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పర్యటించిన పర్యాటక కన్సల్టెంట్ శవంతి గుప్త, భువన్, జిల్లా పర్యాటకశాఖ అధికారి రమేష్, ఈ డి యం సందీప్ తదితరులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత ఐదు రోజులుగా మెదక్ జిల్లా వ్యాప్తంగా నర్సాపూర్ అర్బన్ పార్క్, మెదక్ ఖిల్లా, మెట్ల బావి, బార కమాన్, పోచారం, వేల్పుగొండ తుంబురేశ్వర ఆలయం, చందంపేట, పాపన్నపేట కోటలు, కోముటూరు మజీద్‌లను పరిశీలించి, వారి అనుభవాలను పర్యాటకశాఖ కన్సల్టెంట్ శవంతి గుప్త,భవన్ లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ , జిల్లా అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాలను వారసత్వ, ఆధ్యాత్మిక, పర్యావరణ, ప్రదేశాలుగా విభజించి జిల్లా పర్యాటక అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వానికి. నివేదించాలన్నారు. నివేదికలు సిద్ధం చేయాలని, అధికారులను ఆదేశించారు. జిల్లాలో అందరి సహకారంతో టూరిస్ట్ హబ్ గా తీర్చిదిద్దాలన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వృత్తి నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలి: ఆర్ఐ విజయ్ భాస్కర్



**నారాయణపేట, జూలై 22 (జనంసాక్షి):** పోలీసులు వృత్తి నైపుణ్యం మరింత పెంచుకోవాలని ఆర్ ఐ.విజయభాస్కర్ సూచించారు. జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తు న్న పోలీసు సిబ్బంది వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం, శారీరక దారుఢ్యాన్ని మెరుగుపరచడం, ఆయుధాల వినియోగంలో మరింత ప్రావీణ్యం సాధించడం లక్ష్యంగా జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో మూడు రోజుల ప్రత్యేక శిక్షణ కార్య క్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్ఐ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం అత్యంత బాధ్యతాయుతమైనదని, ప్రతి పోలీసు సిబ్బంది తమ వృత్తి నైపుణ్యాన్ని ఎప్పటిక ప్పుడుమెరుగుపరుచుకుంటూ ఆధునిక పోలీసింగ్‌కు అనుగుణంగాపనిచేయాలని సూచించారు.

*మిగతా 12లో..*

## సంగారెడ్డిలో జగ్గారెడ్డి నేతృత్వంలో నిరసన

- నేషనల్ హైవే పై నిరసనలు
- భారీగా స్తంభించిన ట్రాఫిక్
- నిరసనను అడ్డుకున్న పోలీసులు
- పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట:
- జగ్గారెడ్డి నీ పోలీస్ స్టేషన్ తరలింపు
- సంగారెడ్డి పట్టణంలోని అరెస్టును నిరసిస బైక్ ర్యాలీ
- సంగారెడ్డి నియోజకవర్గంలో పాఠశాలలు బంద్





**సంగారెడ్డి, జులై 22 (జనంసాక్షి):** ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టుకు నిరసనగా సంగారెడ్డి పట్టణంలోనీ పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో బుధవారం టి పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నేషనల్ హైవే నిర్బంధం ,బైఠాయింపు భారీగా స్తంభించిన ట్రాఫిక్ ,రెండు గంటల పాటు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పోలీసుల మధ్య కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. జగ్గారెడ్డి అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కి తరలింపు అనంతరం విడుదల సంగారెడ్డి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో బైక్ ర్యాలీతో నిరసన వ్యక్తం చేశారు. జగ్గారెడ్డి పిలుపుమేరకు భారీగా కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రేయులు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు నియోజకవర్గంలో పాఠశాలలు బందుకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. సుమారు గంట పాటు ఈ రాస్తారోకో కొనసాగడంతో హైదరాబాద్-ముంబై హైవేపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి, భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.





**పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట:**



జగ్గారెడ్డి ధర్నాకు దిగుతారనే ముందస్తు సమాచారంతో పోలీసులు పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద భారీగా మోహరించారు. రాస్తారోకోతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో, పోలీసులు జగ్గారెడి ్డని బలవంతంగా అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు.

ఈ క్రమంలో పోలీసులకు, కాంగ్రెస్ కార్యకర్తలకు మధ్య పెద్ద ఎత్తున తోపులాట జరగడంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది. జగ్గారెడ్డిని తరలిస్తున్న పోలీస్ వాహనాన్ని కార్యకర్తలు చుట్టుముట్టి అడ్డుకున్నారు. దీంతో పోలీసులు తీవ్ర ఇబ్బందుల నడుమ, అతికష్టం మీద వాహనాన్ని అక్కడి నుండి ముందుకు కదిలించి ఆయన్ను తరలించారు

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న నిరంకుశ పాలన అని ఆయన అన్నారు కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లను అరెస్టు చేయించడం దారుణమని ఆయన మండిపడ్డారు , నీట్ పేపర్ లీక్ పై నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై లాఠీఛార్జికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

- **మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మల దహనం**

**నంగునూరు, జూలై 22 (జనంసాక్షి):** ఢిల్లీలో నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జి చేయడం పట్ల నిరసనగా నంగునూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టి బొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనపై కేంద్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించలేదని విమర్శించారు. దీనికి నిరసన తెలుపుతున్న విద్యార్థులపై బల ప్రయోగానికి దిగడం దురదృష్టకరమని తెలిపారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు సంఘీభావం ప్రకటిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన కార్యక్రమాలను అడ్డుకోవడం, ఆయనను అరెస్టు చేయడానికి ప్రయత్నించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఈ ఘటనలకు నిరసనగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అచ్చిన సత్తయ్య ఆధ్వర్యంలో నంగునూరు మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించి దిష్టిబొమ్మలను దహనం చేశారు.నిరసన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో



నాగరాజుపల్లి సర్పంచి ముక్కెర లింగం, మండల బీసీ సెల్ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గాండ్ల రమేశ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బాగు శ్రీకాంత్ యాదవ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాగుల కృష్ణ, కాంగ్రెస్ నాయకులు పంగ రాజశేఖర రెడ్డి, బంగారి నర్సింలు, ఆదిమూలం మైసయ్య, గౌరబోయిన సంపత్, దాసరి కిషన్, రాగుల కనకయ్య, బస్వరాజు రాములు, బండి తిరుపతి, బాలయ్య, తుపాకుల శ్రీనివాస్, సంద బోయిన తిరుపతి, ఆరేపల్లి సురేశ్, పాలెపు నర్సింలు, సుంకరి శేఖర్, గణపురం భాను, ఆవుల నాగరాజు, దబ్బెట మహేశ్, సాంబయ్య, పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. రాజగోపాలపేట ఎస్సై వివేక్ ఆధ్వర్యంలో పోలీసులు దిష్టిబొమ్మల దహనం కార్యక్రమాన్ని అడ్డుకున్నారు.

# విద్యార్థులపై లాఠీచార్జి ప్రజాస్వామ్య హత్యే

- **కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి**
- **ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్న కుమార్ డిమాండ్**




**సిద్దిపేట, జూలై 22, (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో సిద్దిపేట జిల్లా ఏఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ సమీపంలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతి యుతంగా నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం జరిపిన లాఠీచార్జిని ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా సమితి తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్న కుమార్ పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య దేశంలో విద్యార్థులు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు శాంతి యుతంగా నిరసన తెలిపినా, వారి గొంతును లాఠీలతో అణచివేయడం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని విమర్శించారు. ప్రశ్నించే ప్రతి గొంతును బల ప్రయోగంతో అణచివేయాలనే ధోరణిని దేశ ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని అన్నారు

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, వాటిని వినకుండా పోలీసులతో దాడులు చేయించడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు.

దేశంలో 2014 నుండి ఇప్పటి వరకు సుమారు 152 పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని పేర్కొంటూ, వరుస పేపర్ లీకేజీలు దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకుని, ఎన్నో ఆశలతో పరీక్షలకు హాజరవుతుంటే, ప్రశ్నాపత్రాల లీకేజీల కారణంగా వారి భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ముఖ్యంగా 2026 నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాట మాడిన ఘటనగా పేర్కొంటూ, పరీక్షల పారదర్శకతను కాపాడడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ వైఫల్యానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే చేయాలని అన్నారు.

విద్యార్థులపై దాడులు కొనసాగితే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా, అవసరమైతే దేశ వ్యాప్తంగా కూడా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నవీన్ మోహన్ గణేష్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇష్టంతో చదివి శతశాతం ఫలితాలు సాధించాలి

- **జిల్లా డీఐఈఓ ఆర్. గోవింద్ రామ్**



**మునిపల్లి, జూలై 22 (జనంసాక్షి):** ఈ ఏడాది మాదిరిగా విద్యార్థులు ఇష్టంతో చదివి శతశాతం ఫలితాలు సాధించాలని జిల్లా డీఐఈఓ ఆర్. గోవింద్ రామ్ విద్యార్థులకు సూచించారు. బుధవారం బుదేరా ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా డీఐఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందంతో సమావేశమై విద్యా ప్రమాణాల మెరుగుదలపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 100 మందికి పైగా విద్యార్థులు చేరడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులను ఉద్దేశించి డీఐఈఓ మాట్లాడుతూ... గత విద్యా సంవత్సరంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని అన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివి శతశాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి తన జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించే దిశగా క్రమశిక్షణతో ముందుకు సాగాలని, ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాలలో మైనర్ రిపేర్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి, వాటి పురోగతిపై ఆరా తీశారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్. శ్రీనివాస్, అధ్యాపకులు ముద్దం సిద్ధారెడ్డి, సుధాకర్, మారుతి, ఉదయ ప్రసాద్, అబ్బయ్య, సంజయ్ జీ, రమేష్, ఎస్. రవికుమార్, సీహెచ్. రవి, శ్రావణ్ కుమార్, మన్నే రమేష్, జి. కవిత, హితేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కారుతో ఢీకొట్టి వ్యక్తి హత్య..

- **నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**సంగారెడ్డి, జూలై 22(జనంసాక్షి):** కంది గ్రామంలోని అంబేద్కర్ కాలనీలో జరిగిన ఘర్షణలో కారుతో ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కంది పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

పోలీసుల వివరాల ప్రకారం... జూలై 14 అర్ధరాత్రి సుమారు 11:30 గంటల సమయంలో కంది గ్రామానికి చెందిన కాశీపురం ఆంజనేయులు తన కారు (టి ఎస్ 07 జే పీ 8776)లో వెళ్తుండగా, బూడిద రమేష్ కుమారుడు చక్రి రోడ్డుపై నిలబడి ఉండటంతో రోడ్డుపై ఇలా ఉంటే కారు ఎలా వెళ్తుంది అనే విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో అక్కడికి వచ్చిన బూడిద రమేష్ నా కొడుకుతో ఎందుకు గొడవ పడుతున్నావు అని ప్రశ్నించడంతో వాగ్వాదం మరింత తీవ్రరూపం దాల్చింది. అనంతరం ఆంజనేయులు కారును ముందుకు తీసుకెళ్లి తిరిగి వచ్చి బూడిద రమేష్‌ను కారుతో ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఈ ఘటన అనంతరం రాత్రి సుమారు 1:30 గంటలకు కంది గ్రామానికి చెందిన నిందితుడు కాశీపురం ఆంజనేయులను (43) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై సంగారెడ్డి గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి : కాట శ్రీనివాస్ గౌడ్



**రామచంద్రాపురం, జూలై 22 (జనంసాక్షి):** నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీతో పాటు ప్రతిపక్ష నాయకుల అరెస్టులను ఖండిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బీరంగూడ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసుల లాఠీచార్జ్‌ను ఆయన తీవ్రంగా ఖండించారు. అలాగే, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకుల గొంతును అణచివేసే చర్యలను కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## గుండెపోటుతో మృతిచెందిన మోహన్‌రెడ్డికి కంఠరెడ్డి తిరుపతిరెడ్డి ఘన నివాళి





**మెదక్ టౌన్, జూలై 22, (జనంసాక్షి):** మెదక్ పట్టణంలోని 5వ వార్డులో ర్యాలమడుగు గ్రామానికి చెందిన గంగన్నగారి మోహన్‌రెడ్డి మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి వారినివాసానికి వెళ్లి మోహన్‌రెడ్డి పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మోహన్‌రెడ్డి ఆకస్మిక మరణం తీవ్ర విషాదకరమని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. వీరి వెంట పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కసిరెడ్డి. మాణిక్యరెడ్డి, మహీంద్రా మాజీ చైర్మన్ మదన్‌మోహన్‌రావు, ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ బాలగౌడ్, పాపన్నపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు సాదిక్ తదితరులు ఉన్నారు.

## సిద్దిపేట రోడ్డులో గుంతల పూడ్చివేత పనులు

- **రాత్రి స్వయంగా పర్యవేక్షించిన మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య నాగరాజు**



**రామాయంపేట, జూలై 22 (జనంసాక్షి):** రామాయంపేట మున్సిపల్ పరిధిలోని సిద్దిపేట రోడ్డులో ఏర్పడిన గుంతల కారణంగా వాహనదారులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ అధికారులు గుంతల పూడ్చివేత పనులను చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య నాగరాజు అర్ధరాత్రి స్వయంగా పరిశీలించి ప్రారంభించారు. జేసీబీ సహాయంతో గుంతలను పూడ్చే పనులను వేగవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ లావణ్య నాగరాజు మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్ల మరమ్మత్తు పనులు, గుంతల పూడ్చివేతను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని తెలిపారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రధాన రహదారులను దశలవారీగా బాగు చేసి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దేవుని రంజిత్, డాకి స్వామి, చింతల యాదగిరి, పొట్టి సందీప్‌తో పాటు మున్సిపల్ శానిటేషన్ సూపర్‌వైజర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

### రామచంద్రపురంలో
# డీఆర్‌డీవో అధికారి పర్యటన..

• అంగన్‌వాడీ, పాఠశాల, గ్రామాభివృద్ధి పనుల పరిశీలన



నర్సాపూర్, జూలై 22 (జనంసాక్షి):
నర్సాపూర్ మండలంలోని రామచంద్రపురం గ్రామాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) అధికారి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, అక్కడి సేవలపై ఆరా తీశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో విద్యార్థుల హాజరు, వారికి కల్పిస్తున్న వసతులపై చర్చించారు. గ్రామంలో నూతనంగా నిర్మించ నున్న గ్రామ సంఘం భవనానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. అలాగే గ్రామ సర్పంచ్, రైతులతో పంప్‌సెట్‌లు/పంప్‌హౌస్‌ల (పంపొండ్స్) అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సంగమేశ్వర్, గ్రామ సర్పంచ్ గీత, పంచాయతీ కార్యదర్శి మల్లేశం, గ్రామ సంఘం అధ్యక్షురాలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## సీపీఎస్ రద్దు ఉద్యమానికి ఊపు

• ఆగస్టు 23 'చలో హైదరాబాద్' విజయవంతం చేయాలని పిలుపు



మెదక్ టౌన్, జూలై 22 (జనంసాక్షి): సీపీఎస్‌ను తక్షణమే రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం మెదక్ పట్టణంలో ఘనంగా బైక్ ర్యాలీ, సన్నాహక సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ముందుగా ఏడుపాయల వనదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మెదక్ పట్టణంలోని పాత ఎస్పీ కార్యాలయం వద్ద ఉన్న స్వాగత ద్వారం నుంచి బైక్ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకోగా, అక్కడ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

## దుద్దెడలో అఖిలపక్ష నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం



కొండపాక, జూలై 22 (జనంసాక్షి): సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ గ్రామంలోఅఖిల పక్ష నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం యంగ్ ఇండియా స్కూల్ సాధన సమితి ఆధ్వర్యంలో, అఖిల పక్ష నాయకుల సమక్షంలో దుద్దెడలోని వైష్ణవి గార్డెన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఘనంగా నిర్వహించ బడింది. ఈ సమావేశంలో కొండపాక మండలానికి చెందిన అఖిల పక్ష నాయకులు, సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ అనంతుల నరేందర్, అంబాటి బాలచందర్, రాగుల దుర్గయ్య, నూనెకుమార్ యాదవ్, శిలుముల వెంకటేష్‌తో కలిసి మాట్లాడుతూ యంగ్ ఇండియా స్కూల్‌ను ప్రస్తుత ప్రాంతం నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ తరలించకుండా కాపాడేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచుల ద్వారా తీర్మానాలు చేయించి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించారు. అలాగే అవసరమైతే ప్రజాస్వామ్య బద్దంగా నిరసనలు, ధర్నాలు, ర్యాలీలు తదితర అన్ని రకాల ఉద్యమ కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప ప్రజా ప్రతినిధులు వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర విద్యాశాఖ మంత్రి
# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

• పుల్కల్‌లో విద్యాసంస్థల బహిష్కరణ..
• బస్వాపూర్ చౌరస్తాలో కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ధర్నా



పుల్కల్,జూలై 22(జనంసాక్షి): నీట్ పరీక్ష పత్రాల లీకేజీ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ సోమవారం పుల్కల్ మండల కేంద్రంలో విద్యాసంస్థలను బహిష్కరింపజేసి బస్వాపూర్ చౌరస్తాలో విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు నిరంజన్ మాట్లాడుతూ,నీట్ పరీక్షల నిర్వాహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. నీట్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యాన్ని అంగీకరించి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో కాంగ్రెస్ నాయకులు బోయిని శ్రీనివాస్,మండల ప్రధాన కార్యదర్శి ఎట్టి శ్రీనివాస్, ఆత్మ కమిటీ డైరెక్టర్ మన్నె విటల్,యేసు,నర్సింలు,వీరేశం, ఎన్ఎస్‌యూఐ నాయకులు ప్రేమ్ కుమార్,ప్రవీణ్,వినయ్, మధు,రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు సమీకృత శిక్షణ

• నాణ్యమైన బోధన అందించి ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి ం చేయాలి
• ఉపాధ్యాయులకు ముగిసిన మొదటి విడత వృత్త్యంతర శిక్షణ
• మండల విద్యాధికారి భీమ్ సింగ్




మునిపల్లి, జూలై 22 (జనంసాక్షి): ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమీకృత ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారని మండల విద్యాధికారి భీమ్ సింగ్ పేర్కొన్నారు.తెలంగాణ మోడల్ పాఠశాలలో బుధవారం మండల విద్యాధికారి భీమ్ సింగ్ పర్యవేక్షణలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యా ప్రాధాన్యతలు, కనీస అభ్యసన సామర్థ్యాల సాధన, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టితో బోధన నిర్వహించే విధానాలపై ఉపాధ్యాయులకు సమగ్ర శిక్షణ అందించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి భీమ్ సింగ్ మాట్లాడుతూ...
మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, ఉపాధ్యాయుల బోధనను మరింత బలోపేతం చేయడం, వారి వృత్తి నైపుణ్యాలను పెంపొందించడం, విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను సాధింపజేయడం లక్ష్యంగా నిర్వహించిన మొదటి విడత మూడు రోజుల వృత్త్యంతర ఉపాధ్యాయ శిక్షణ విజయవంతంగా ముగిసిందన్నారు.
ప్రభుత్వ బలోపేతం చేసి విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమీకృత ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతోందన్నారు. మండల రిసోర్స్ పర్సన్ల ద్వారా మూడు రోజులపాటు సమగ్ర శిక్షణ అందించామని, ఇందులో పాల్గొన్న ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందించి ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతం చేయాలని సూచించారు.
జిల్లా రిసోర్స్ పర్సన్ చంద్రమౌళి మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి తన తరగతికి అవసరమైన కనీస అభ్యసన సామర్థ్యాలను సాధించేలా శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. తెలుగు, ఆంగ్లం, గణిత విషయాల్లో విద్యార్థి కేంద్రిత బోధనకు ప్రాధాన్యం ఇచ్చి శిక్షణ లక్ష్యాలను సాధించాలని సూచించారు.
శిక్షణ ముగింపు కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ చంద్రమౌళితో పాటు మండల రిసోర్స్ పర్సన్‌లు సంతోషమ్మ, సాయిలు, అనురాధ, ఉమారాణి, మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సర్ 100 శాతం సంపూర్ణం



శివ్వంపేట, జూలై 22 (జనంసాక్షి): ఓటరు జాబితా ప్రత్యేక సవరణ శివంపేట మండలం టీక్య దేవమ్మగూడెం గ్రామపంచాయతీ మరో మైలురాయిని చేరుకుంది. మండలంలోని అన్ని గ్రామాల కంటే ముందుగా బూత్ నంబర్-298 పరిధిలో ఎస్ఐఆర్ సవరణ ప్రక్రియను బి ఎల్ ఓ కవిత 100 శాతం విజయవంతంగా పూర్తి చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా సవరణ ప్రక్రియను మండలంలోనే మొదటగా లక్ష్యాన్ని పూర్తి చేసినందుకు బీఎల్ఓ కవితను గ్రామ సర్పంచ్ తేజస్విని రాజేందర్ నాయక్ బుధవారం ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజేందర్, వార్డ్ సభ్యులు పుల్‌సింగ్, శారద, సికిందర్, తేజ, హెచ్ఎం రాజు తదితరులు ఉన్నారు.

# కొమురవెల్లి రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవానికి రండి: బిజెపి నేత నత్తి మల్లేష్



తూప్రాన్, జూలై 22 (జనంసాక్షి): కొమురవెల్లి మల్లన్న ఆలయ సమీపంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ కొమురవెల్లి మల్లన్న స్వామి ఆలయాన్ని భక్తులు ప్రయాణంలో సులువుగా చేరుటగాను నూతనంగా ఏర్పాటుచేసిన రైల్వే స్టేషన్ ఈనెల 26న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రారంభిస్తారని ఈ ప్రారంభోత్సవానికి అందరూ రావాలని బిజెపి నాయకులు నత్తి మల్లేష్ తెలిపారు.
ఇటీవల కాలంలో మంజూరు చేసిన రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు పూర్తిచేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు రైలు ప్రయాణం ద్వారా మల్లన్న పుణ్యక్షేత్రానికి సులువుగా చేరి మార్గాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ద్వారా సుగమమం చేయడం జరిగింది. ఏర్పాటు చేసిన రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవానికి ప్రతి గ్రామంలో నుండి హిందూ బంధువులందరూ రావలసిందిగా కోరారు .మండలం లోని వెంకటరత్నాపూర్ గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మి కి ఆహ్వాన పత్రికను అందించిన బిజెపి జిల్లా నాయకులు, కాళ్ళాకల్ గ్రామ మాజీ సర్పంచ్ నత్తి మల్లేష్ ముదిరాజ్. వీరితోపాటు బిజెపి మండల అధ్యక్షులు పిట్ల పోచయ్య, తూప్రాన్ మున్సిపల్ 2వార్డ్ కౌన్సిలర్ అశోక్, శక్తి కేంద్రం అధ్యక్షులు రాజు, గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఉప సర్పంచ్ మహేష్ యాదవ్, పాలకవర్గం సభ్యులు, తదితరులు ఉన్నారు.

## ఘనంగా మాజీ ఎంపీ జన్మదిన వేడుకలు



బెజ్జంకి,జూలై 22,(జనంసాక్షి): మాజీ కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలను బెజ్జంకి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి,స్వీట్లు పంపిణీ చేశారు. కరీంనగర్ ఎంపీగా ఉన్న సమయంలో స్మార్ట్ సిటీ అభివృద్ధికి నిధులు తీసుకురావడంతో పాటు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా, పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా సేవలందించారని అని అన్నారు. బెజ్జంకి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులతో బోయినపల్లి వినోద్‌కుమార్ ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో జీవిస్తూ మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు,శ్రేణులు,కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంతో రైతులకు భారీ నష్టం

• బాధితులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలి





**గుమ్మడిదల, జూలై 22 (జనంసాక్షి):** గుమ్మడిదల మండలంలోని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లలో ఏర్పడుతున్న సాంకేతిక లోపాలను సకాలంలో సరిచేయకపోవడంతో వ్యవసాయ బోరు మోటార్లు వరుసగా కాలిపోతున్నాయని తెలిపారు. గత నెలలో రాంనగర్ ప్రాంతంలో విద్యుత్ లోపాల కారణంగా సుమారు పది మంది రైతుల బోరు మోటార్లు కాలిపోగా, రెండు రోజుల క్రితం నాయిని చెరువు ప్రాంతంలో మరో ఐదు గురు రైతుల మోటార్లు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు భారీ ఆర్థిక నష్టాన్ని చవిచూస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ సీజన్‌లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం వల్ల పంటలకు నీటి సరఫరా నిలిచిపోయి సాగు పనులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని రైతులు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు బాధ్యత వహించి నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే గుమ్మడిదల మండలంలోని అన్ని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను అత్యవసరంగా తనిఖీ చేసి, అవసరమైన మరమ్మతులు చేపట్టి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఎస్ఐఆర్ ఓటర్ సమగ్ర సర్వేపై కాంగ్రెస్ నాయకుల పర్యవేక్షణ



**కొల్చారం, జూలై 22 (జనంసాక్షి):** కొల్చారం మండల కేంద్రంతో పాటు చిన్న ఘనాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ ఓటర్ సమగ్ర సర్వేలో ఓటర్ డిజి టలైజేషన్ ప్రక్రియ ఎలా జరుగు తుందనే అంశాన్ని కొల్చారం మం డల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు పర్యవేక్షించారు. నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ అన్వేష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఆదేశాల మేరకు ఈ పర్యవేక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని బీఎల్ఓ సూపర్‌వైజర్లకు రోజువారీ నివేదిక లను ఏ విధంగా సమర్పించాలి, సర్వే ప్రక్రియను ఎలా సమన్వయం చేయాలి అనే అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఓటర్ సమగ్ర సర్వేలో ఎలాంటి లోపాలకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొల్చారం గ్రామ సర్పంచ్ దేవనగారి శేఖర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్, చిన్న ఘనాపూర్ సర్పంచ్ చందాపురం మల్లన్ రెడ్డి, మండల జనరల్ సెక్రటరీ గంగసాని మహే శ్వర్ రెడ్డి, సూపర్‌వైజర్ ప్రవీణ్ రెడ్డి, ఉప సర్పంచ్ నర్సింలు, రమేష్, నాగరాజు, బీఎల్వోలు అశోక్, శ్రావణ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం..



**నిజాంపేట, జూలై 22 (జనంసాక్షి):** ప్రతిఒక్కరు బాధ్యతగా ఒక్క మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని బిజెపి నాయకులు ఆకుల రమేష్ పిలుపునిచ్చారు. నిజాం పేట మండలం నందిగామ గ్రామంలో కార్యదర్శి తో కలిసి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. మొక్కలు పెంచి ప్రగతికి తోడ్పడాలని, పర్యావరణ కాలుష్యాన్ని నివారించడానికి మొక్కలే ప్రధానమని ఆయన పేర్కొన్నారు.

# ఇల్లు నిర్మించుకోవడం సంతోషంగా ఉంది



**తూప్రాన్, జూలై 22(జనంసాక్షి):** ఇల్లు లేనివారు ఇల్లు నిర్మించుకోవడం సంతోషంగా ఉందని రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జిల్లా కాంగ్రెస్ నాయకులు చిటుకుల మహిపాల్ రెడ్డి తెలిపారు. మండలం లోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహాన్ని సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు చిటుకుల మహి పాల్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వ సహాయంతో ఇల్లు నిర్మించుకోవడం సంతోషంగా ఉందని సొంత స్థలంలో నిర్మించుకోవడానికి ప్రభుత్వం ప్రోత్సాహిస్తుం దని ఈ పథకాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరా రు. ఈ సందర్భంగా గృహ యజమానులు వడ్డే నాగమణి మహేష్ దంపతులను ఘనంగా సత్కరించారు. ప్రభుత్వం సహాయంతో ఇల్లు నిర్మించుకోవడం సంతోషంగా ఉందని మహేష్ దంపతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్ రెడ్డి, వెంకటేశ్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, లింగం, విశ్వరాజ్, శ్రీశైలం, మన్నె తిరుపతి, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పారిశుధ్య పనులను పరిశీలించిన డీఎల్పీవో

• హోటల్‌కు యజమానికి రూ.500 జరిమానా



**కంగ్టి, జూలై 22(జనంసాక్షి):** మండల కేంద్రంలో బుధవారం ఖేడ్ డీఎల్‌పీఓ సుధాకర్ రెడ్డి సందర్శిం చి పారిశుధ్య పరిస్థితులను పరిశీ లించారు. ఈ సందర్భంగా హోటళ్ల, కిరాణా దుకాణాలు, కూరగాయలు, పండ్ల విక్రేతలు, బేకరీలు తదితర వ్యాపార సంస్థల యజమానులు తప్పనిసరిగా చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ తడి, పొడిచెత్తను వేర్వేరుగా నిర్వహించాలని అవగాహన కల్పించారు. తనిఖీల్లో భాగంగా బందయ్య స్వామి హోటల్ ముందు చెత్త పేరుకుపోయి ఉండటాన్ని గుర్తించిన డీఎల్‌పీఓ రూ.500 జరిమానా విధించారు. గ్రామంలో పారిశుధ్య నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్, సర్పంచ్ కృష్ణ, గ్రామపంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్ పాల్గొన్నారు.

# ఇంకుడు గుంతతో నీటి సమస్యకు చెక్..

• కమిషనర్ సాయికుమార్




**నర్సాపూర్, జూలై 22 (జనంసాక్షి):** భూగర్భ జలాలను పరిరక్షించేందుకు ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్ సూచించారు. 'క్యాచ్ ది రైన్' కార్యక్రమంలో భాగంగా బుధవారం పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాచునూరి లక్ష్మీరాజు యాదవ్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రతిజ్ఞ చేయించారు. 200 చదరపు గజాలకు పైగా విస్తీర్ణంలో భవనాలు నిర్మించిన వారు తప్పనిసరిగా రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని, లేనిపక్షంలో మున్సిపల్ చట్టం–2019 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ వనముల బుచ్చేష్ యాదవ్, కౌన్సిలర్లు, శ్రీకాంత్, రవి, సరళ ఆంజనేయులు గౌడ్, సుధీర్ గౌడ్, నిరంజన్ దాస్, దావూద్, ఇలియాస్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతలకు అహర్నిశలు కృషిచేస్తా

• వెల్దుర్తి నూతన ఎస్సై కరుణాకర్ రెడ్డి



**వెల్దుర్తి, జూలై 22 (జనంసాక్షి):** శాంతి భద్రతల పరిరక్షణకు తప్పకుండా అహర్నిశలు కృషి చేస్తానని వెల్దుర్తి నూతన ఎస్సై కరుణాకర్ రెడ్డి అన్నారు బుధవారం వెల్దుర్తి ఎస్సైగా కరుణాకర్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు వెల్దుర్తి ఎస్సైగా విధులు నిర్వహిం చిన ఎస్ఐ రాజు మెదక్ ఎస్పి ఆఫీసుకు అయ్యారు సిద్దిపేట విధులు నిర్వహించిన కరుణాకర్ రెడ్డి వెల్దుర్తికి బదిలీపై వచ్చారు ఈ సందర్భంగా ఎస్సీ కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ... మండలంలో ఎలాంటి అసాంఘిక చర్యలకు పాల్పడిన ఉపేక్షించేది లేదని శాంతి పరిరక్షణకు సహకరించాలని ఆయన అన్నారు

# అత్యవసర సేవలకు అనవసరంగా ఫోన్ కాల్

• పోలీస్ సేవలకు అంతరాయం కలిగిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు



**న్యాల్‌కల్, జూలై 22, (జనంసాక్షి):** అత్యవసర సమయాల్లోనే అందిం చుకోవాల్సిన 100 సేవలను మద్యం మత్తులో తరచూ.. అనవ సరంగా ఫోన్ కాల్ చేస్తూ పోలీస్ ల సేవలకు విఘాతం కలిగిస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి నట్లు హద్నూర్ ఎస్సై సుజిత్ తెలిపారు. స్థానిక ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వడ్డీ గ్రామానికి చెందిన బొంగొండ మారుతి గత కొన్ని నెలలుగా మద్యం మత్తులో 100 అత్యవసర సేవలకు అనవసరంగా ఫోన్ కాల్ చేస్తూ పోలీస్ విధులకు ఆటంకం కలిగించారు. ఇట్టి వ్యక్తిపై విచారణ చేపట్టి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మద్యం మత్తులో, సరదా కోసం, తప్పుడు ప్రచారం 100కు ఫోన్ కాల్ చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. అత్యవసర సమయాల్లో మాత్రమే ప్రజానీకం బాధ్యతాయుతంగా 100 సేవల వినియోగించుకోవాలని ఎస్ఐ సూచించారు.

# గ్రామస్తుల ఫిర్యాదుపై గ్రామాన్ని సందర్శించిన డి.ఎల్.పి.ఓ



**తూప్రాన్, జూలై 22 (జనంసాక్షి):** మండలంలోని వెంకట రత్నాపూర్ గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మి గ్రామ ప్రజలతో దురుసుగా ప్రవర్తిస్తూ పురుష పదజాలని వాడుతూ ఇబ్బందులకు గురి చేస్తుందని గ్రామపంచాయతీ నిధులను దుర్వినియోగం చేసిందని విషయంలో ఆమెపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, ఆర్డీవో కార్యాలయంలో గ్రామ సర్పంచ్ పై వెంకటారత్నాపూర్ గ్రామానికి చెందిన యువకులు ఫిర్యాదు చేయగా డిఎల్పిఓ సాయిబాబా ఫిర్యాదిదారుల సమక్షంలో విచారణ చేశారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు తూప్రాన్ మండల డి ఎల్ పి ఓ సోమవారం వెంకటరత్నపూర్ గ్రామాన్ని సందర్శించారు. వారు ఈ సందర్భంగా గ్రామపంచాయతీ భవనంలో సమావేశం ఏర్పాటు చేసి ఇచ్చిన ఫిర్యాదుదారులతో పాటు పాలకవర్గం సభ్యులను నిర్ణయాలను అడిగి తెలుసుకున్నాడు. ఫిర్యాదుదారులు మాట్లాడుతూ బూతులు, అనుచిత వ్యాఖ్యలు, పురుష పదజాలంతో గ్రామస్తులను ఇబ్బంది చేస్తుందని వాటర్ ట్యాంకు వద్ద నీరు వచ్చే సమయంలో రాకుండా తాలం వేయడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ పై ఆరోపించారు. అంతేకాకుండా పారిశుద్ధ్య పనులను ప్రతిరోజు నిర్వహించడం లేదని అన్నారు, సఫాయి సిబ్బందితో పనిచేయించకుండా వారితో కలిసి కాలయాపన చేయడం జరుగుతుందని గ్రామస్తులు నిలదీశారు. డి ఎల్ పి ఓ అధికారి వారి అభిప్రాయాలను పరిశీలించిన అనంతరం గ్రామ సర్పంచి తో అనుచిత వ్యాఖ్యలు చేయరాదని, పురుష పదజాలం వాడరాదని అందరితో కలిసి పరిపాలన కొనసాగించాలని అన్నారు. పంచాయతీ రికార్డులను సాధించిన చేసుకుంటున్నారని రికార్డులన్నీ పరిశీలిస్తానని దుర్వినియోగానికి పాల్పడితే జిల్లా కలెక్టర్కు నివేదిక సమర్పిస్తానని తెలిపారు . గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై తదుపరి విచారణ చేపడతామని డిఎల్పిఓ పేర్కొన్నారు. అవినీతికి పాల్పడిన సర్పంచ్ని సస్పెండ్ చేయాలని కోరారు. డి ఎల్ పి ఓ సాయిబాబా మాట్లాడుతూ గ్రామస్తులు చెప్పిన వివరాలను జిల్లా కలెక్టర్కు నివేదిక సమర్పిస్తానని తెలిపారు అందరూ కలిసిమెలిసి ఉండాలని తెలిపారు.




## భూభారతి - భూ రీసర్వే సేవలను వివరించిన ఆర్డీఓ

న్యాల్‌కల్, జూలై 22, (జనంసాక్షి): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం కృషి చేపడుతున్ను.. భూభారతి – భూ రీసర్వే కార్యక్రమంలో జహీరాబాద్ ఆర్డీఓ దేవుజా హాజరై రైతులకు అవగాహన కల్పించారు. బుధవారం న్యాల్ కల్ మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ సురేష్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో.. భూ సమస్యలు, వాటిని పరిష్కరించే విధి విధానాలపై అవగాహన కల్పించారు. భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రత్యేకంగా "భూ రీసర్వే" కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో తహసిల్దార్ ప్రభువులు, స్థానిక సీఐ జక్కుల హనుమంతు, రెవెన్యూ అధికారులు, పలువురు రైతులు, అధికార, విపక్ష పార్టీలకు చెందిన శ్రేణులు పాల్గొన్నారు.

## కంగ్టి ఎంపీడీవోగా దయాకర్ రావు బాధ్యతలు

- నూతన ఎంపీడీవోను సత్కరించిన నాయకులు



కంగ్టి, జూలై 22(జనంసాక్షి): మండల నూతన ఎంపీడీవో గా దయాకర్ రావు బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవోను ఉప సర్పంచ్ బి.మోహన్ నాయక్, కరణం శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో విజయవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఎంపీడీవో దయాకర్ రావు అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## తగాదాలకు పరిష్కారం భూ భారతి

పాపన్నపేట, జూలై 22 (జనంసాక్షి): భూ భారతి భూముల రీసర్వే తో భూ తగాదాలను పరిష్కరించవచ్చని జిల్లా సర్వేయర్ కిషన్,స్థానిక తహశీల్దార్ సతీష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ముద్దాపూర్ గ్రామంలో జరిగిన భూ భారతి భూముల రీసర్వే అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు.
డిజిటల్ రికార్డుల రూపకల్పనకు భూ భారతి తోడ్పడుతుందన్నారు. భూమి సంబంధిత విషయాలను అన్నదాతలకు, గ్రామ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ యాదగిరి,గ్రామ సర్పంచ్ పిట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

- ఆపరేషన్ ముస్కాన్‌లో 78 మంది చిన్నారుల రక్షణ
- జిల్లాలో 50 కేసుల నమోదు
- ఆపరేషన్ ముస్కాన్ బృందాల సమస్యలు, సవాళ్లను అడిగి తెలుసుకున్న ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు




మెదక్ బ్యూరో, జూలై 22 (జనంసాక్షి): నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, వారి బాల్యాన్ని పనులకు కాకుండా విద్యకు అంకితం చేయాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అన్నారు. బాలల చేతుల్లో పనిముట్లు కాకుండా పుస్తకాలు ఉండేలా ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ వల్ల దేశ భవిష్యత్తు అంధకారంగా మారే ప్రమాదం ఉందని, ప్రపంచంలో అత్యధిక యువ జనాభా కలిగిన దేశాల్లో భారత్ ముందంజలో ఉందని, ఈ యువతే దేశ భవిష్యత్తుకు బలమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జూలై 1 నుంచి నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని హోటళ్లు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, దుకాణాలు, వ్యాపార సముదాయాల్లో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించి వెంటనే రక్షించాలని అధికారులను ఆదేశించారు. రక్షించిన చిన్నారులను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) ముందు హాజరుపరిచి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి అప్పగించాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో సంరక్షణ గృహాలకు తరలించాలని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ ప్రారంభమైన 20 రోజుల్లో జిల్లాలో 78 మంది చిన్నారులను రక్షించినట్లు ఎస్పీ తెలిపారు. రక్షించిన చిన్నారులను సీడబ్ల్యూసీ ముందు హాజరుపరిచి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం అప్పగించినట్లు పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థకు సంబంధించి జిల్లావ్యాప్తంగా 50 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ ముస్కాన్ బృందాలు విధులు నిర్వహించే సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించడం, బాల కార్మికులను గుర్తించడం, రక్షణ చర్యలు చేపట్టే సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులను బృంద సభ్యులను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో ఉన్న సమయంలో ఎలాంటి సమస్యలు లేదా ఇబ్బందులు ఎదురైనా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైన సహకారం అందిస్తామని ఎస్పీ సూచించారు. బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. బాలల భవిష్యత్తును కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాలలతో పనులు చేయించే యజమానులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రజలు కూడా పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఈ సమన్వయ సమావేశంలో మెదక్ డియస్పి ప్రసన్న కుమార్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ జార్జ్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సతేంద్ర ప్రసాద్, విద్యా, వైద్య శాఖల అధికారులు, ఎన్‌జీవో ప్రతినిధులు, రెండు డివిజన్లకు చెందిన ఆపరేషన్ ముస్కాన్ బృందాల సభ్యులు పాల్గొన్నారు.

## తడిచెత్త పొడిచెత్త పై అవగాహన కార్యక్రమం



రామాయంపేట, జూలై 22 (జనంసాక్షి): రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని మంజీరా విద్యా సంస్థల్లో ఈరోజు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ లో భాగంగా తడి చెత్త – పొడి చెత్త పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ప్రవేశపెట్టిన జల్ శక్తి అభియాన్: క్యాచ్ ది రైన్‌జన్ భాగీదారీ 2026లో భాగంగా పాఠశాల విద్యార్థులతో నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమం చేపట్టారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఏ.రవీందర్ శానిటరీ ఇన్స్పెక్టర్ వనిత మంజీరా స్కూల్ కరస్పాండెంట్ జితేందర్ రెడ్డి మరియు మున్సిపల్ సిబ్బంది రంజిత్ పాల్గొన్నారు.

## ఇథనాల్ ఫ్యాక్టరీల కాలుష్యంపై మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన కనగండ్ల తిరుపతి

- 12 గ్రామాల ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని హెచ్ఆర్‌సీకి ఫిర్యాదు




బెజ్జంకి,జూలై 22,(జనంసాక్షి): బెజ్జంకి మండల పరిధిలోని గ్రీన్ వేస్ బయో ఎనర్జీప్రైవేట్ లిమిటెడ్ బయో ప్రొడక్ట్స్ (ఇథనాల్) ఫ్యాక్టరీల వల్ల పరిసర గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కనగండ్ల తిరుపతి తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్(హెచ్ఆర్‌సీ)ను ఆశ్రయించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీల కారణంగా వాయు కాలుష్యం, తోటపల్లి చెరువు జల కాలుష్యం, ధ్వని కాలుష్యం ఏర్పడుతున్నాయని,వీటి ప్రభావంతో పరిసరాల్లోని సుమారు 12 గ్రామాలకు చెందిన 18 నుంచి 20 వేల మంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని అన్నారు.ప్రజల ఆరోగ్యం,పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా సమస్యను హెచ్ఆర్‌సీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. హెచ్ఆర్‌సీ ముందు తమ వాదనలు వినిపించి,ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. త్వరలోనే ఈ సమస్యపై ప్రజలకు న్యాయం జరుగుతుందనే ఆశాభావాన్ని కనగండ్ల తిరుపతి వ్యక్తం చేశారు.మండల ప్రజల ఆరోగ్యం,కాలుష్య నివారణ లక్ష్యంగా బోడిగె అనిల్,గాజా రాజు,కొమిరె వర్ధన్ తదితరులు హెచ్ఆర్‌సీని ఆశ్రయించిన వారిలో ఉన్నారు.

## రామాయంపేటలో 90% శాతం సబ్సిడీపై జిప్సం పంపిణీ: ఏవో ప్రవీణ్ కుమార్

- టన్ను జిప్సం రూ.534కే అందజేత
- నేల సారాన్ని పెంచే జిప్సం.. రైతులకు వ్యవసాయ శాఖ అవగాహన
- చౌడు భూముల పునరుద్ధరణకు జిప్సమే పరిష్కారం
- జిప్సం వాడకంతో వరి దిగుబడి,నాణ్యత పెరుగుతాయి: ఏఓ ప్రవీణ్ కుమార్



రామాయంపేట,జూలై 22 (జనంసాక్షి): రామయంపేట రైతులకు మెరుగైన దిగుబడులు అందించడంతో పాటు నేల సారాన్ని పెంపొందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 90% శాతం సబ్సిడీ జిప్సంను బుధవారం రామాయంపేట మండలంలో రైతులకు పంపిణీ చేశారు.మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ రైతులకు జిప్సం బస్తాలను అందజేసి, వాటి వినియోగంపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక టన్ను జిప్సం అసలు ధర రూ.5,340 కాగా, ప్రభుత్వ సబ్సిడీతో రైతులకు కేవలం రూ.534కే అందిస్తున్నట్లు తెలిపారు. జిప్సం వినియోగాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
జిప్సం సహజసిద్ధంగా లభించే క్యాల్షియం సల్ఫేట్ ఖనిజమని, ఇందులో పంటలకు అత్యంత అవసరమైన 21 శాతం క్యాల్షియం, 18 శాతం సల్ఫర్ (గంధకం) ఉంటాయని వివరించారు. ముఖ్యంగా వరి సాగులో జిప్సం వినియోగం వల్ల చౌడు (క్షార) నేలలు పునరుద్ధరించబడటంతో పాటు నేలలోని సోడియం ప్రభావం తగ్గి, భూమి తిరిగి సాగుకు అనుకూలంగా మారుతుందని చెప్పారు.అలాగే సల్ఫర్, క్యాల్షియం లోపాలను నివారించడం ద్వారా మొక్కల ఎదుగుదల, కణజాల బలోపేతం, రోగనిరోధక శక్తి పెరుగుతాయని తెలిపారు. జిప్సం వాడకం వల్ల వేర్ల వ్యవస్థ బలపడటంతో పాటు నేలలో గాలి ప్రసరణ, నీటి ఇంకుదల మెరుగై పోషకాల గ్రహణ సామర్థ్యం పెరుగుతుందని వివరించారు. దీని ఫలితంగా వరి పంటలో దిగుబడి, గింజ నాణ్యత గణనీయంగా పెరుగుతాయని పేర్కొన్నారు.రైతులు తమ భూముల స్వభావానికి అనుగుణంగా జిప్సం వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రవీణ్, సాయికృష్ణతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో మృతి చెందిన మహిళ కుటుంబానికి బీఆర్ఎస్ నేతల ఆర్థికసాయం

- ఆపదలో అండగా బీఆర్ఎస్
- బాధిత కుటుంబానికి రూ.5వేల సహాయం



రామాయంపేట, జూలై 22 (జనంసాక్షి): రామాయంపేట మండలంలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన చెప్యాల రేణుక (30) వివాహిత గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందిన విషయం తెలుసుకున్న మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.వారి సూచనల మేరకు బీఆర్ఎస్ నాయకులు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ,అత్యవసర అవసరాల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు.కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ మైసగౌడ్, ఉపసర్పంచ్ విజయభాస్కర్ రెడ్డి,మాజీ ఉపసర్పంచ్ పంతె మల్లేష్, వార్డు సభ్యుడు నాదబోయిన లింగం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఓటరు జాబితా సవరణ ప్రక్రియను 100శాతం పారదర్శకంగా పూర్తిచేయాలి

- కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాపోలు రాజా బహదూర్ రెడ్డి

**నంగునూరు, జులై 22 (జనంసాక్షి):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను 100. /.వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాపోలు రాజబాబు రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను అత్యంత కచ్చితత్వంతో పూర్తి చేయాలని, ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు. నంగునూరు మండలంలోని కోనాయిపల్లి, తిమ్మాయిపల్లి, పలు గ్రామాల్లో పర్యటించి, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని పరిశీలించారు. ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ ఎలా జరుగుతోం క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు, ఈ సందర్భంగా బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు), సిబ్బందితో మాట్లాడి ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా రాజా బహదూర్ రెడ్డి మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హత కలిగిన యువతి, యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో విలువైనదని, ప్రతి




ఒక్కరూ దాన్ని వినియోగించుకునేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి ఏఎంసి డైరెక్టర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# గుడుపల్లి గ్రామంలో కంది, మినుము, సోయాబీన్ పంటల క్షేత్రస్థాయి పరిశీలన



**మొగడంపల్లి, జూలై 22(జనంసాక్షి):**
మొగడంపల్లి మండల వ్యవసాయ అధికారి శ్రీ హస్నుద్దీన్ గుడుపల్లి గ్రామంలో కంది, మినుము, సోయాబీన్ పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల ఎదుగుదల, ప్రస్తుత పరిస్థితి, చీడపీడలు మరియు వ్యాధుల నివారణకు రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీ ప్రదీప్ కుమార్, శ్రీ భూమేష్ పాల్గొని రైతులతో కలిసి పంటలను పరిశీలించారు. రైతులు పంటల సాగుకు సంబంధించిన సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. రైతులు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని అధికారులు సూచించారు.

# నీటి విషయంలో పొదుపు చర్యలు పాటించాలి

- మునిసిపల్ కమీషనర్ పి.చంద్ర శేఖర్ రావు




**అయిజ, జులై 22 (జనంసాక్షి):** అయిజ పురపాలక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కో ఆర్డినేషన్ సమావేశంలో కమీషనర్,పి చంద్ర శేఖర్ రావు మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్నినో ప్రభావం వలన వర్షాలు అతి తక్కువగా కురిసే అవకాశం ఉందని, అందువలన పట్టణంలోని అన్ని వార్డులలోని ప్రజలకు వర్షపు నీటిని భూమిలోకి ఇంకిపోయేలా ప్రతి ఒక్కరూ తమ తమ ఇండ్ల ముందు చిన్న చిన్న ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా మునిసిపల్ సిబ్బంది, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే వర్షాలు తక్కువ గా కురిసి తీవ్ర నీటి యద్దడి ఏర్పడుతుందని, అందువలన ఇప్పుడు నీటిని పొదుపుగా వినియోగించాలని, నీటిని వృథాగా పోనివ్వరాదని ప్రజలకు తెలియజేయాలని, సూచించారు. అలాగే ఈ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల కూడా అవగాహన కల్పించాలని, ఇంటి పరిసరాల చుట్టూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, పాత టైర్లు,పూల కుండీలలో,తాగి పడేసిన కొబ్బరి బొండాలలో, వాడని నీటినిల్వ పాత్రలలో వర్షపు నీరునిల్వ ఉండకుండా చూసి లార్వా లాంటి వ్యాధికారక కీటకాల పెరుగుదల లేకుండా తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి ఇంటి దగ్గర ఉన్న నల్లా లకు మూతలు లేదా టాప్ లు ఉన్నాయో లేదో చూసుకోవాలని, టాప్ లేకుండా నీరు వృథాగా పోయే వారికి ఒకటి రెండు సార్లు చెప్పి తదుపరి నల్లాలకు డమ్మీలు వేసి నీటి వృదాను అరికట్టాలని వాటర్ సప్లయ్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీర్ రాజశేఖర్, సాత్విక్, మునిసిపల్ అధికారులు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, మునిసిపల్ సిబ్బంది, ఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయాలంటే అరెస్టులేనా?



**రాజోలి, జూలై 22 (జనంసాక్షి):**
తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులు, అన్‌మ్యాన్డ్, పీస్‌రేట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాకు ముందు రాజోలి మండలం మానుదొడ్డి గ్రామానికి చెందిన ఆర్టిజన్ జేఏసీ జిల్లా చైర్మన్ శివప్రసాద్‌తోపాటు కార్మికులను మంగళవారం అర్ధరాత్రి పోలీసులు ఇంటి వద్ద నుంచి అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ..ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను అణచివేసేందుకు అక్రమ అరెస్టులు చేయడం సరికాదని, ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# బస్ సౌకర్యం కల్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు



**కోహెడ, జూలై 22(జనంసాక్షి):**
కోహెడ మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు చదువుకోవడానికి రావడం కోసం బస్సు సౌకర్యం కల్పించిన రాష్ట్ర రవాణా, బి సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా గుండారెడ్డిపల్లి నుండి కోహెడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకోవడానికి రావడానికి విద్యార్థులకు బస్ సౌకర్యం కల్పించినందుకు కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ కోతి యాదగిరి, అధ్యాపకులు వడ్డపల్లి రాజమౌళి, అధ్యాపక బృందం ధన్యవాదములు తెలియజేశారు. ఈ బస్సు వలన సుమారుగా గుండారెడ్డిపల్లి, తంగళ్ళపల్లికి చెందిన 32 మంది విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించి వారి చదువుకు ప్రోత్సాహం అందించిన మంత్రి కి విద్యార్థిని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు రెండు గ్రామాల ప్రజా ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, లెక్చరర్‌లు పాల్గొన్నారు.

# గద్వాలలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మండిపాటు

**గద్వాల, జులై 22 (జనంసాక్షి):** రాష్ట్ర బీజేపీ పార్టీ పిలుపు మేరకు, బీజేపీ నాయకురాలు డీకే స్నిగ్ధా రెడ్డి బుధవారం గద్వాల పట్టణంలోని వైఎస్సార్ చౌక్ వద్ద కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ బీజేపీ శ్రేణులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ పార్లమెంట్‌లో ప్రధానమంత్రి నరేం ద్ర మోదీపై ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ప్రజాస్వామ్య విరుద్ధమని, ఆ వ్యాఖ్యలను ఆయన వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో బీజేపీ కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్యామ్ రావ్, కేకే రెడ్డి, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు సమత గౌడ్ పాల్గొన్నారు. అలాగే కౌన్సిలర్లు కుమ్మరి శ్రీను, శాలన్న, చంద్రశేఖర్, నాయకులు బీజేపీ రజక నరసింహ, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పెబ్బేరులో వైభవంగా వారాహి నవరాత్రులు

- లక్ష్మీ గణపతి హోమం, అన్నప్రసాద వితరణ



**పెబ్బేరు, జూలై 23 (జనంసాక్షి):** వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో జరుగుతున్న వారాహి నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శ్రీ లలితా త్రిపురసుందరి దేవి సన్నిధానంలో ఎనిమిది రోజులుగా నిర్వహిస్తున్న వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు.

వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ జరిగిన హోమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమం అనంతరం అమ్మవారికి మహా మంగళహారతి సమర్పించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. వారాహి దేవి అత్యంత శక్తివంతమైన దేవతగా భక్తులు విశ్వసిస్తారు. ఈ నేపథ్యంలో నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ మహిళలు విశేష భక్తిశ్రద్ధలతో అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ, ప్రతి రోజూ భిన్నమైన అలంకరణలతో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు.

ఈ మహోత్సవంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, మహిళా భక్తులు, యువత, గ్రామ పెద్దలు మరియు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తుల “జై వారాహి మాత” నినాదాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో మారుమోగింది.

# రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా శ్రీరంగాపూర్‌లో రాస్తారోకో



**శ్రీరంగాపూర్, జూలై 22 (జనంసాక్షి):**
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ శ్రీహరి రాజు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విష్ణు ముదిరాజ్ మాట్లాడుతూ, రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా జనరల్ సెక్రెటరీ రెడ్డి చర్ల శ్రీహరి రాజు శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు విష్ణు మరియు మాజీ ఎంపిటిసి ఎల్ల స్వామి యాదవ్, మాజీపిఎసిఎస్ డైరెక్టర్ శ్రీనివాస్ గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

• తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల

**వెల్దుర్తి, జూలై 22 (జనంసాక్షి):**

సర్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ వెన్నెల అన్నారు. బుధవారం వెల్దుర్తి మండలంలోని మానేపల్లి మండల పరిధి గ్రామాలలో సర్ ప్రక్రియను. ఆమె స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా బిఎల్ఓలతో మాట్లాడి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఎల్వోల అందజేసిన ఇన్వర్రేషన్ ఫామ్‌లను తప్పులు లేకుండా పూర్తిగా నింపి బిఎల్ఓ లకు అందజేయాలన్నారు ప్రతి ఓటరు గడప తట్టి ఓటు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆమె అన్నారు ప్రతి ఒక్క ఓటర్ విధిగా బిఎల్ఓలకు సహకరించాలని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి నియోజకవర్గ కోఆర్డినేటర్ అన్వేష్ రెడ్డి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి తలారి మల్లేశం తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రేగులపల్లి, బెజ్జంకి క్రాసింగ్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులుగా కొట్టే రాజు, కళ్లెం పోచయ్య



**బెజ్జంకి,జూలై 22,(జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయి నూతన కమిటీల ఏర్పాటు కార్యక్రమంలో భాగంగా బెజ్జంకి మండలంలోని రేగులపల్లి,బెజ్జంకి క్రాసింగ్ గ్రామశాఖ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.బెజ్జంకి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో రేగులపల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా కొట్టే రాజు,బెజ్జంకి క్రాసింగ్ గ్రామశాఖ అధ్యక్షుడిగా కళ్లెం పోచయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రేగులపల్లి సర్పంచ్ జంగిలి లక్ష్మీ తిరుపతి,బెజ్జంకి క్రాసింగ్ సర్పంచ్ గాజ రవళి శ్రీనివాస్,జీల లింగం, ప్రసాద్,తిరుపతి రెడ్డి, లక్ష్మీ నరసింహస్వామి ఆలయ మాజీ చైర్మన్ జెల్ల ప్రభాకర్,మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య, యూత్ ప్రెసిడెంట్ కర్రావుల సందీప్,బండి వేణు,సంగ రమేష్, గుండారం గ్రామశాఖ అధ్యక్షుడు ప్రశాంత్,చంద్రయ్య,శ్రీశైలం తదితరులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు వివిధ శాఖాధికారులతో సమీక్ష



• విధిగా హాజరవ్వలని మండలం ప్రత్యేకాధికారి ఆదేశం

**న్యాల్‌కల్, జులై 22, (జనంసాక్షి):** ప్రభుత్వ పథకాల అమలు, చేపట్టనున్న పలు అభివృద్ధి పనుల నిర్వహణపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేకాధికారి యాదగిరి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యాల్ కల్ లోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించే సమీక్షా సమావేశానికి మండలంలోని రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్యా, వైద్యం, విద్యుత్, ఉపాధి హామీ, వ్యవసాయం, మహిళ శిశు సంక్షేమ శాఖ, అంగన్వాడి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, తదితర శాఖలకు చెందిన అధికారులు విధిగా హాజరు కావాలని ఆదేశించారు.

## పెట్రోల్ పంపుల రిపేర్లతో వాహనదారుల ఇక్కట్లు

**మక్తల్, జూలై 22 (జనంసాక్షి):**

గత వారం రోజులుగా మండల పరిధి లోని జక్లేర్ గ్రామంలో గల హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం పంపులు రిపేర్లు జరుగుతుండడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సామాజిక కార్యకర్త బిజ్వార్ మహేష్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాహనదారులు పెట్రోల్ పంపు దగ్గర పెట్రోల్, డీజిల్ ఉంది అని ఆశతో పెట్రోల్ పంపు దగ్గరికి వస్తే తీరా పెట్రోల్, డీజిల్ లేదని యజమానులు తెలపడంతో వాహనదారులు గత్యంతరం లేక 115 రూపాయలు ఉన్న పెట్రోల్ ను 150 రూపాయలకు ప్రైవేట్ వ్యాపారస్తుల దగ్గర కొనుక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పెట్రోల్ పంపుల యజమానులు పనులు పూర్తిచేసి గ్రామ పరిసర ప్రాంతాలైన పులి మామిడి, బిజ్వార్, గుడిగండ్ల, సామన్ పల్లి, మదన్ పల్లి, జవలాపురం, కాచువార్ తదితర గ్రామాలతో పాటు అంతరాష్ట్ర రహదారిపై వెళున్న ప్రయాణికులకు పెట్రోల్, డీజిల్ అందేలా చర్యలు తీసుకోవాలని మహేష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులపై లాఠీచార్జ్ దారుణం



• ప్రశ్నించే గొంతుకలను అణచొద్దు
• నీట్ లీకేజీపై పార్లమెంట్‌లో చర్చ జరపాలి
• కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి
• మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి

**మెదక్ బ్యూరో, జులై 22(జనంసాక్షి):** ఢిల్లీలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. ఈ ఘటనను తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగం కల్పించిందని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను వినాలే తప్ప, బలప్రయోగంతో నిరసనలను అణచివేయకూడదని సూచించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, పార్లమెంట్‌లో విద్యార్థుల సమస్యలు, నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర చర్చ నిర్వహించాలని కోరారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో విద్యార్థుల ఆందోళన సందర్భంగా జరిగిన ఘటనలపై స్వతంత్ర న్యాయ విచారణ జరిపించాలని, నీట్ పేపర్ లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు తగిన పరిహారం అందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దేశ వ్యాప్తంగా పారదర్శక పరీక్షా విధానాన్ని అమలు చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని పద్మా దేవేందర్‌రెడ్డి కోరారు.

## రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ.. వనపర్తిలో కాంగ్రెస్ పార్టీ ఆందోళన

• ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం



**వనపర్తి బ్యూరో, జూలై 22 (జనంసాక్షి):** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసిసి), తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.రాజకీయ కక్షసాధింపుతో ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుని అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.
రాహుల్ గాంధీ దేశ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ప్రజా నాయకుడని, ఆయనను భయపెట్టే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష స్వరాన్ని అణచివేయడం,విభిన్న అభిప్రాయాలను నిరోధించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.నిరసన కార్యక్రమం అనంతరం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వనపర్తి రాజీవ్ చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తిరుపతయ్య, బ్రహ్మం చారి, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కదిరే రాములు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, మార్కెట్ యార్డ్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, పెద్దమందడి మండలాధ్యక్షుడు వెంకటస్వామి, గోపాల్పేట మండలాధ్యక్షుడు నరహరి, వనపర్తి పట్టణ కౌన్సిలర్లు, మైనార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## టీకాలతోనే పిల్లలకు సంపూర్ణ రోగ నిరోధక శక్తి

• జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.ఏ.శ్రీనివాసులు




**జడ్చర్ల, జూలై 22 (జనంసాక్షి):**
ప్రతి చిన్నారికి వారి వయస్సును బట్టి వేయాల్సిన టీకాలను సరైన సమయంలో వేయించినప్పుడే సంపూర్ణంగా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, తద్వారా పిల్లలను వివిధ వ్యాధుల బారిన పడకుండా కాపాడవచ్చని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. ఏ. శ్రీనివాసులు స్పష్టం చేశారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు బాదేపల్లి-ఏ, బాదేపల్లి-సీ, కావేరమ్మ పేట కేంద్రాల్లో ప్రతి బుధవారం నిర్వహించే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యాక్సిన్లను వ్యాక్సిన్ క్యారియర్ లలో భద్రపరిచే విధానాన్ని, లబ్ధిదారుల సంఖ్యకు సరిపడా టీకాలు అందుబాటులో ఉన్నాయా లేదా అని పరిశీలించారు. అధిక రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న చికిత్స వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, రక్తహీనత ఉన్నవారిని గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రిలోనే సుఖ ప్రసవాలు జరిగేలా బర్త్ ప్లానింగ్ చేయాలని ఆదేశించారు. అనంతరం జడ్చర్ల ఏరియా ఆసుపత్రిని సందర్శించి మెడికల్ సూపరింటెండెంట్ డా. అసదుల్లా తో కలిసి ప్రసవాల తీరుతెన్నులను సమీక్షించారు. కార్యక్రమంలో డాక్టర్లు శివకాంత్, భరత్, సంబంధిత ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్, నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని పిడిఎస్‌యు డిమాండ్




**ధన్వాడ, జులై 22 (జనంసాక్షి):** నారాయణపేట జిల్లా ధన్వాడ మండల్ పాతపల్లి గ్రామంలో నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.
ఈ కార్యక్రమానికి అధ్యక్షత పిడిఎస్ యు జిల్లా కార్యదర్శి బి.మహేష్ వహించగా పిడిఎస్ యు రాష్ట్ర నాయకులు బి.బాలకృష్ణ మాట్లాడుతూ దేశ రాజధాని దిల్లీలో నీట్ పేపర్ లీకేజీతో పాటు విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల పై దాడికి పాల్పడిన పోలీసు అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న బీజేపీ ప్రభుత్వం ఈ వైఫల్యాలకు పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, అలాగే దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన ఈ పరిణామాలకు రాజకీయ బాధ్యత వహిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కే. టెరప్ప, మాజీ సర్పంచ్, జి.కృష్ణయ్య, పిడిఎస్ యు జిల్లా నాయకులు పరశురాం, అభి, మాజీ జిల్లా నాయకులు వై.కురుమూర్తి, నరేష్, పి వై ఎల్ జిల్లా నాయకులు గణేష్, గ్రామ నాయకులు నందకిషోర్, ప్రవీణ్, నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అక్రమ అరెస్ట్‌పై కాంగ్రెస్ ఆగ్రహం!

- గాంధీచౌక్‌లో కాంగ్రెస్ పార్టీ నిరసన ధర్నా..
- దద్దరిల్లి, మారుమోగిన నినాదాలు
- నిరసన కార్యక్రమం సక్సెస్...!!

**వనపర్తి బ్యూరో, జూలై 22 (జనంసాక్షి):** నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీకి నిరసనగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన శాంతియుత నిరసన కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని గాంధీ చౌరస్తాలో బుధవారం నిర్వహించడం జరిగింది. టిపిసిసి రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, వనపర్తి డిసిసి చీఫ్ శివసేన రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్న కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత, పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే.. సమాధానం చెప్పకుండా వ్యవహరిస్తున్న బిజెపి ప్రభుత్వం నిర్బంధ ధోరణి అవలంబిస్తుందని మండిపడ్డారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇంటి ముందు ప్రతిపక్ష నేతలు ధర్నా చేస్తున్న సందర్భంలో.. అక్రమంగా అరెస్టులకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. దేశ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల, పేద వర్గాల పక్షాన గళం విప్పుతోందని పేర్కొన్నారు. లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును కేంద్ర ప్రభుత్వం నాశనం చేస్తోందని నాయకులు మండిపడ్డారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడం కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు న్యాయం చేయాలి. రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి. గాంధీ చౌక్ వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో



విరుచుకుపడ్డారు. లేనిపక్షంలో నిరసనలను మరింత ఉధృతం చేస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. దేశ ప్రధాని మోదీ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దగ్ధం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్, పట్టణ అధ్యక్షులు కదిరి రాములు, వనపర్తి మండల అధ్యక్షులు రవి కిరణ్, గోపాల్పేట మండల అధ్యక్షులు నరహరి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్కాకుల సతీష్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఆదిత్య, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు జానకి రాములు, నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

# ఎల్‌నినోపై అధికారులతో సమీక్ష

**మల్దకల్, జూలై 22 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఎల్‌నినో పైన సీజనల్ వ్యాధులపైన పంచాయతీ కార్యదర్శులతో మీటింగ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి



రాజశేఖర్ ఎలాంటి పంటలు సాగు చేయాలో వాటిపైన వివరించారు. హెల్త్ డిపార్ట్ మెంట్ సీజనల్ వ్యాధుల పైఅవగాహన కల్పించారు. వాటర్ సప్లై పైన ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, వెటర్నరీ డాక్టర్ వినయ్ కుమార్ పశువుల సీజన్లో వచ్చే గొర్రెలు మేకలకు నివారణ మందులు గాలి కుంటూ టీకాలు, జంతువుల జాగ్రత్తలు గురించి వివరించారు. ఎంఈఓ సురేష్ విద్యా, బడి బయట పిల్లలు, హార్టికల్చర్ పండ్ల తోటలు ఎక్కువగా సాగు చేయాలని కూరగాయలు ఎక్కువ సాగుచేయాలని తెలియజేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఆంజనేయరెడ్డి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్-44 పై అండర్ పాస్ ఏర్పాటు చేయాలి

- ఎర్రవల్లి గ్రామస్తుల వినతి

**ఎర్రవల్లి, జూలై 22 (జనంసాక్షి):** జాతీయ రహదారి-44 ఎర్రవల్లి గ్రామ పరిధిలో అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కోరుతూ పాలమూరు జాతీయ రహదారుల డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు బుధవారం గ్రామస్తులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. ఎర్రవల్లి గ్రామంలో జాతీయ రహదారికి ఇరువైపులా



ప్రజలు నివాసం ఉంటున్నారని తెలిపారు. అయితే గ్రామానికి చెందిన పాఠశాల, దేవాలయం, మరియు స్మశాన వాటిక వంటి ముఖ్యమైన ప్రదేశాలన్నీ రహదారికి ఒకే వైపున ఉన్నాయని పేర్కొన్నారు. రోడ్డుకు అవతలి వైపు నివసించే ప్రజలు, విద్యార్థులు నిత్యం ఈ ప్రాంతాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న చౌరస్తా వద్ద భారీ వాహనాల రద్దీ కారణంగా రోడ్డు దాటడం ప్రాణసంకటంగా మారిందని, చిన్న పిల్లలు, వృద్ధులు ప్రమాదాల బారిన పడుతున్నారని వివరించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా పాత ఊరి సమీపంలో తక్షణమే అండర్ పాస్ నిర్మించాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు దశరథం సాగర్, కృష్ణసాగర్ మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కార్యక్రమం

- పాల్గొన్న ఉద్యాన శాఖ అధికారి మహేశ్వరి

**ఉర్కొండ, జూలై 22, (జనంసాక్షి);** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కల్వకుర్తి ఉద్యానశాఖ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఉద్యాన పంటల్లో తీసుకోవలసిన తక్షణ చర్యల గురించి మరియు ఉద్యాన శాఖ ద్వారా అందించే సబ్సిడీ వివరాల గురించి ఉర్కొండ మండలంలోని మాదారం, గుడిగానిపల్లి, ఉరుకొండ మండల కేంద్రంలో రైతులకు తెలియజేయడం జరిగింది. ఉద్యాన పంటలు తీవ్రంగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది కావున నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచడం, అన్ని ఉద్యాన తోటల్లో డ్రిప్ ఇరిగేషన్, ఫర్టిగేషన్ ద్వారా నీరు మరియు ఎరువులను అందించాలని, సేంద్రీయ మరియు ప్లాస్టిక్ మల్చింగ్ ద్వారా నేలలు తేమ సంరక్షణ చేసుకోవాలని, నీటి కుంటల నిర్మాణం చేసుకోవాలని, జీవామృతం వర్మి కంపోస్టు వంటి సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా నేల సారాన్ని పెంచాలని, కరువును తట్టుకునే జామా ఉసిరి సీతాఫలం దానిమ్మ మామిడి వంటి పంటలను వేసుకోవాలని ,అంతేకాకుండా పచ్చి రొట్ట ఎరువులు జీనుగా జన్మ వంటి పంటల ద్వారా సేంద్రీయ కర్బను పెంచి మట్టిలో నీటి నిల్వ సామర్థ్యాన్ని మెరుగుపరచాలని తెలియజేయడం జరిగింది. బెండకాయ వంకాయ గోరుచిక్కుడు మరియు స్వల్పకాలిక కూరగాయలు సాగు చేయాలని డ్రిప్పు స్ప్రింక్లర్ ద్వారా నీటిని అందించాలని మల్చింగ్ ద్వారా మట్టిలో తేమ నిల్వ ఉండేలా చూసుకోవాలని,



పండ్ల తోటల పాదులలో సేంద్రియ మల్చింగ్ వేసుకోవాలని తెలియజేయడం జరిగింది. మాదారం గ్రామంలోని రైతు మాలే కృష్ణారెడ్డి మూడవ సంవత్సరం పామాయిల్ తోటను సందర్శించడం జరిగింది. ఎల్ నినో ప్రభావం వల్ల పామాయిల్ తోటకి మొక్కపాదుల్లో సేంద్రీయ మల్చింగ్, జనుము జీనుగ విత్తనాలు చల్లుకోవడం అంతేకాకుండా అంతర పంటలు వేసుకోవడం రోజు నీటి తడి మొక్కపాదుల్లో ఉంచడం వర్మీ కంపోస్ట్ వేప పిండి లాంటి సేంద్రియ ఎరువులని వాడుకోవాలని తెలపడం జరిగింది దీనివల్ల మొక్క ఒత్తిడికి గురికాకుండా తక్కువ నీళ్లతో ఎక్కువ రోజులు తేమ మొక్క పాదుల్లో పట్టుకొని ఉండటం వల్ల మంచి దిగుబడి పొందవచ్చనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి మహేశ్వరి, హెచ్ ఈ ఓ శివ లీల, ప్రతాప్ రెడ్డి, అర్చన విజయలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి దీప్తి ,ఏఈఓ హెచ్ఈఓ, గ్రామ సర్పంచ్లు మల్లేష్,రుక్మా రెడ్డి గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది.

# జడ్చర్లలో కాంగ్రెస్ నాయకుల నిరసన

**జడ్చర్ల, జూలై 22 (జనంసాక్షి):** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తో పాటు ఇతర విపక్ష నేతల ముందస్తు అరెస్టులను నిరసిస్తూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఇచ్చిన పిలుపు మేరకు, జడ్చర్ల శాసన



సభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం జడ్చర్ల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నాయకుల అక్రమ అరెస్టులను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ కు పూర్తి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు, ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్న తీరుకు వ్యతిరేకంగా నాయకులు నినాదాలు చేశారు. నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, మాజీ వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పవనంపల్లి సర్పంచ్ భర్తపై

# రౌడీషీటర్ దాడి.. ఎస్ఐ పాత్రపై గ్రామస్తుల అనుమానం

- ఎస్పీ స్పందించాలని డిమాండ్

**మల్దకల్, జూలై 22 (జనంసాక్షి):** మల్దకల్ మండలం పవనంపల్లి గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పవనంపల్లి గ్రామ సర్పంచ్ రాజేశ్వరి భర్త రామాంజనేయులుపై గ్రామానికి చెందిన రౌడీషీటర్ పెద్దపల్లి అజయ్ తన అనుచరులతో కలిసి ప్రాణాంతక దాడికి పాల్పడ్డారు.



భూ వివాదం నెపంతో దాదాపు 20 మందికి పైగా దుండగులు పొలం వద్దకు వచ్చి ఈ దాడికి ఒడిగట్టారు. పొలం వద్దకు పిలిపించుకుని ఒక్కసారిగా దాడికి దిగడంతో, వారి నుండి తప్పించుకునేందుకు రామాంజనేయులు దాదాపు ఒక మైలు దూరం ప్రాణభయంతో పరిగెత్తారని, అయినప్పటికీ దుండగులు వెంబడించి ఆయనపై తీవ్రంగా దాడి చేసి, చంపేందుకు ప్రయత్నించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. స్థానిక ఎస్ఐ పాత్రపై అనుమానాలున్నాయని ఈ ఘోర ఘటన వెనుక మల్దకల్ ఎస్ఐ శ్రీహరి పాత్రపై గ్రామస్తులు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దాడి జరగడానికి ముందే రామాంజనేయులు మల్దకల్ ఎస్ఐని సంప్రదించగా, 'మీరు పొలం దగ్గరకు వెళ్లండి' అని ఎస్ఐ చెప్పడం వెనుక పక్కా ప్లాన్ ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రౌడీషీటర్ పెద్దపల్లి అజయ్ మరియు పవనంపల్లి మాజీ సర్పంచ్ జయరాములు ఆదేశాల మేరకే ఎస్ఐ శ్రీహరి నిందితులకు సహకరించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జిల్లా ఎస్పీ వెంటనే స్పందించాలని,గ్రామంలో ఒక ప్రథమ పౌరురాలైన సర్పంచ్ భర్తకే రక్షణ లేకపోతే, సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని పవనంపల్లి గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం మరియు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ గారు తక్షణమే స్పందించి, దాడికి పాల్పడిన రౌడీషీటర్ పెద్దపల్లి అజయ్, మాజీ సర్పంచ్ జయరాములుతో పాటు వారికి సహకరించిన మల్దకల్ ఎస్ఐ శ్రీహరిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. బాధితులకు న్యాయం జరగని పక్షంలో ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

## విద్యార్థులపై

# లాఠీచార్జికి నిరసనగా మోడీ దిష్టిబొమ్మ దహనం

**గండీడ్,జూలై 22 (జనంసాక్షి):** గండీడ్ మండలంలోని వెన్నచేడ్ గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై కేంద్ర



ప్రభుత్వం లాఠీచార్జి చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. అలాగే లాఠీచార్జిలో గాయపడిన విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు. విద్యార్థుల సమస్యలను అణచివేతతో కాకుండా,చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు. ఈనిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు,కార్యకర్తలు,యువజన విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరు మొక్కలు నాటేందుకు ముందుకు రావాలి

• మునిసిపల్ కమీషనర్ పి.చంద్ర శేఖర్‌రావు



**అయిజ, జులై 22 (జనంసాక్షి):** అయిజ పురపాలక సంఘం పరిధిలోని గద్వాల రోడ్ నందు వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమను మునిసిపల్ కమీషనర్ పి.చంద్రశేఖర్ రావు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మరియు భూతాపం తగ్గి వర్షాలు విరివిగా కురవాలంటే మొక్కలు నాటే అవశ్యకత ఎంతో ఉందని, ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటేందుకు ముందుకు రావాలని, దీన్ని ప్రతీ ఒక్కరూ తమ తమ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎల్నినో ప్రభావం వలన వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడడం మనం గమనిస్తూనే ఉన్నామని, అందువలన మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సులోచనమ్మ, మద్దిలేటి, బిఆర్‌యస్ నాయకులు వెంకన్న గౌడ్, ఉప్పరి శ్రీను, మునిసిపల్ సీనియర్ అసిస్టెంట్ సి లక్ష్మన్న, వార్డు ఆఫీసర్లు,బిల్ కలెక్టర్లు ఆర్ పిలు తదితరులు పాల్గొన్నారు.

## మల్దకల్‌లో ఘనంగా పై అప్రాగ్జిమేషన్ డే



**మల్దకల్, జూలై 22 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని పి.యం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పై అప్రాగ్జిమేషన్ డేను బుధవారం ఘనంగా నిర్వ హించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. సురేష్ అధ్యక్షత వహించారు. (పై) విలువ, దాని చరిత్ర, గణితంలో ప్రాముఖ్యత, వృత్తాల వైశాల్యం చుట్టు కొలత గణనలో దాని వినియోగం,శాస్త్ర-సాంకేతిక రంగాల్లో పాత్ర గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే పై అప్రాగ్జిమేషన్ డే యొక్క ఉద్దేశ్యం, గణితంపై ఆసక్తిని పెంపొందించే కార్యక్రమాల అవసరాన్ని వివరించి విద్యార్థులతో చర్చనిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పై విలువను 100 దశాంశాల వరకు తెలిపారు. ఆర్యభట్టీయంలోని పై విలువను తెలిపే శ్లోకం ను,దాని అర్థాన్ని వివరించారు. గణితంలో పై విలువ ఉపయోగించిన సందర్భాలలో తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి, తార్కిక ఆలోచనశాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తాయని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శుభ, భాస్కర్,జాకీర్ హుస్సేన్, వరలక్ష్మి,ప్రదీప్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గద్వాల బాలుర పాఠశాలకు పీఎంశ్రీ



**గద్వాల, జులై 22 (జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం శ్రీ పథకం ప్రభుత్వ పాఠశాలలకు ఒక గొప్ప వరం లాంటిదని బీజేపీ జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. గద్వాల పట్టణంలోని ఇండోర్ స్టేడియం సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పీఎం శ్రీ పథకానికి ఎంపికైన సందర్భంగా ఆమె పాఠశాలను సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, కార్పొరేట్ స్థాయికి దీటుగా నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. 2022లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. పాఠశాలల్లో కల్పించే ఆధు నిక వసతులు: డిజిటల్ క్లాస్‌లు స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, డిజిటల్ బోధన సౌకర్యాల ఏర్పాటు.ఆధునిక ల్యాబ్‌లు సైన్స్, గణితం, కంప్యూటర్ సబ్జెక్టుల కోసం అధునాతన ప్రయోగశాలలు.గ్రంథాలయాలు విద్యార్థుల్లో పఠనాశక్తిని, ఆత్మవిశ్వాసాన్ని పెంచేలా లైబ్రరీల అభివృద్ధి. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ రావ్, జిల్లా కోశాధికారి మిర్జాపురం రెడ్డి, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు సమతా గౌడ్, రామన్ గౌడ్, వెంకటేష్, రాజాచారి తదితరులు పాల్గొన్నారు.

## పేట టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట, జూలై 22 (జనంసాక్షి):** పోలీసు శాఖ పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే క్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ బుధవారం నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని అన్ని విభాగా లను పరిశీలించి రికార్డులు, పెండింగ్ పిటిషన్లు, విచారణల పురోగతి, సిబ్బంది విధి నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించారు.ఈ సందర్భంగా స్టేషన్‌లో నమోదైన ప్రతి పిటిషన్‌ను వెంటనే ఎంట్రీ చేసి, నిర్దిష్ట సమయంలో విచారణ పూర్తి చేసి ఫిర్యాదు దారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ఎలాంటి పిటిషన్‌ను అనవసరంగా పెండింగ్‌లో ఉంచరాదని, ఒకవేళ పెండింగ్‌లో ఉంటే దానికి గల కారణాలను వారికి తెలుపుతూ రికార్డుల్లో స్పష్టంగా నమోదు చేయాల ని సూచించారు.ప్రతి రోజు జనరల్ డైరీ తప్పనిసరిగా నమోదు చేయాలని, రోజు వారి విధుల వివరాలు క్రమ బద్ధంగా నమోదు చేయాలని ఆదేశించారు. బయటి విధులకు వెళ్లే ప్రతి పోలీసు సిబ్బందికి సంబంధిత డ్యూటీ పాస్/అధికార అనుమతి పత్రం జారీ చేసి, వారి రాకపోకల వివరాలు నమోదు చేయాలని సూచించారు. అన్ని కేసులను ఆన్‌లైన్ పోర్టల్‌లో సకాలంలో నమోదు చేయాలని, ఎలాంటి కేసు ఎంట్రీ పెండింగ్‌లో ఉండకూ డదని స్పష్టం చేశారు. స్టేషన్ పరిధిలో నమోదయ్యే ప్రతి కేసు సమాచా రాన్ని వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి నవీకరించాలని ఆదేశించారు.

ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్న ఎస్పీ, స్టేషన్ పరిధిలో 24 గంటల పాటు నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. ప్రజలకు సామాజిక అంశా లపై సైబర్ నేరాలు, నేరాల నివారణ, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా, రాత్రి వేళల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు.ప్రతి రోజు విధులు ప్రారంభానికి ముందు రోల్ కాల్ నిర్వహించి, సిబ్బందికి విధుల కేటాయింపు, చట్టాలు, క్రమశిక్షణ, ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించే విధానంపై సూచనలు ఇవ్వాలని తెలిపారు. స్టేషన్‌లోని అన్ని రికార్డులు, రిజిస్టర్లు, కేసు వివరాలు పూర్తిస్థాయిలో, ఎలాంటి లోపాలు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు.

ప్రజలకు మరింత త్వరితగతిన న్యాయం అందించేందుకు అవసరమైన చోట ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ నమోదు చేసే విధానాన్ని సమర్థ వంతంగా అమలు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యా దుదారునికి వారి ఫిర్యాదుకు సంబంధించిన రసీదు తప్పనిసరిగా అందజేయాలని,కేసు నమోదు చేసిన అనంతరం ఎఫ్ఐఆర్ కాపీని ఉచితంగా ఇవ్వాలని స్పష్టం చేశారు. పోలీసు సిబ్బంది ప్రతిఒక్కరూ క్రమశిక్షణ, సమయపాలన, బాధ్యతాయుతమైన విధి నిర్వహణ పాటించాలని, ప్రజలతో స్నేహపూర్వకంగా, గౌరవప్రదంగా వ్యవహరించి పోలీస్ శాఖపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని ఎస్పీ సూచించారు.

ఈ తనిఖీలో డీఎస్పీ నల్లపు లింగయ్య, టౌన్ సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లుతో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమీల ఫౌండేషన్ సేవ కార్యక్రమం.. మొబైల్ యాప్ ఆవిష్కరణ




**నారాయణపేట, జూలై 22(జనంసాక్షి):** సమాజ సేవే ధ్యేయంగా సేవా కార్యక్రమాలను నిర్వ హిస్తున్న ప్రమీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణ పేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోరోగులు, వారి సహాయకులు, నిరుపేదలకు అన్నదాన కార్యక్రమా న్నిమంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమీల ఫౌండేషన్ మొబైల్ యాప్‌ను అధికారి కంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రమీల ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా.కోరం మహేష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం గొప్ప మానవతా సేవ అని పేర్కొన్నారు. సమాజంలోని నిరుపేదలు, ఆపదలో ఉన్నవారు అవసరమైన వారికి తమ వంతు సహాయం అందించేందుకు ప్రమీల ఫౌండేషన్ నిరంతరం కృషిచేస్తుందని తెలిపారు. ప్రజలకు ఫౌండేషన్ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాల సమాచారం, సభ్యత్వ నమోదు, స్వచ్ఛంద సేవా అవకాశాలు, ఇతర సేవలను సులభంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రమీల ఫౌండేషన్ మొబైల్ యాప్‌ను రూపొందించి అధికారికంగా ఆవిష్కరించినట్లు డా.కోరం మహేష్ రెడ్డి తెలిపారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రోగులు, వారి సహాయకులు, నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి భోజనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కోరం శివరాజ్ రెడ్డి, కోరం హర్షవర్ధన్ రెడ్డి, సత్యపాల్, భీమ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నరసింహ, రమేష్, కోరం గోవర్ధన్ రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## విద్యార్థులను రాజకీయాలకు ఉపయోగించారంటూ ఉపాధ్యాయుడిపై బీజేపీ ఫిర్యాదు

**మక్తల్, జూలై 22 (జనంసాక్షి):** మక్తల్ మండలంలోని కొత్తపారేవుల ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు శ్రీధర్‌పై విచారణ జరిపి వెంటనే సస్పెండ్ చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)కు బుధవారం ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. బలరాం రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 21న పాఠశాలలో విద్యార్థులతో కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శింపజేసి నిరసన నిర్వహించారంటూ ఆరోపించారు. అభం శుభం తెలియని చిన్నారులను రాజకీయాలకు ఉపయోగించడం, వారి మనసుల్లో విద్వేష భావాలు నాటేలా వ్యవహరించడం తీవ్రంగా ఖండించదగ్గ విషయమని అన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు, నైతిక విలువలు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు రాజకీయ వ్యాఖ్యలు చేయించడం సరికాదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం విస్తృతంగా నిధులు కేటాయిస్తోందని, అలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులను ఉపయోగించడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ఈ ఘటనపై ఉన్నతస్థాయి కమిటీతో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయుడు శ్రీధర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా విద్యార్థులతో ప్లకార్డులు ప్రదర్శింపజేయడం, రాజకీయ ఉపన్యాసాలు ఇవ్వడం వంటి అంశాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. డీఈఓను కలిసి వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. బలరాం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కర్ని స్వామి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకట్ రాములు ముదిరాజ్, మక్తల్ మండల అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, మండల నాయకుడు ఆడెం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచాలి

• నాగర్ కర్నూల్ జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్



**వెల్దండ జులై 22 (జనంసాక్షి) :** పభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలనీ,విద్యా ప్రమాణాల విషయంలో రాజీ ఉండకూడదని జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ పేర్కొన్నారు.బుధవారం వెల్దండ మండలంలోని జడ్.పి.హెచ్.ఎస్ బొల్లంపల్లి, వెల్దండ(బాయ్స్), వెల్దండ( గర్ల్స్) మరియు ఎంపీపీ ఎస్ బండోనిపల్లి పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీచేశారు.విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, తరగతుల నిర్వహణ, బోధన విధానం, విద్యార్థుల అభ్యాస స్థాయి, పాఠశాల నిర్వహణ వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారు చదువుతున్న పాఠాలు, పుస్తకాల వినియోగం, ఉపాధ్యాయుల బోధన, ప్రతిరోజూ తరగతులు సక్రమంగా జరుగుతున్నాయా అనే విషయాలపై ఆరా తీశారు.విద్యార్థుల హాజరు శాతం, ప్రతిరోజూ నిర్వహిస్తున్న తరగతులు, సబ్జెక్టుల బోధన, విద్యార్థుల అభ్యాస స్థాయి, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఎఫ్.ఎల్.ఎన్ నిర్వహణ,పాఠశాల నిర్వహణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించాలని చేయాలనీ అదేశించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి చంద్రుడు, ప్రధానోపాధ్యాయులు రవీందర్, సుగుణ మరియు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బాపన్‌పల్లిలో వందశాతం ఎస్ఐఆర్ పూర్తి

- అభినందించిన సర్పంచ్ శ్రీనివాస్



నారాయణపేట, జూలై 22 (జనంసాక్షి): నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం, బాపన్‌పల్లి గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియ వందశాతం విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రక్రియ విజయవంతంగా పూర్తవడానికి అహర్నిశలు కృషి చేసిన బిఎల్ఓలు, బిఎల్ఏలు, పంచాయతీ సిబ్బందితో పాటు సహకరించిన గ్రామ ప్రజలకు హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి, అవసరమైన వివరాలను సకాలంలో సేకరించి ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన అధికారుల సేవలను ఆయన కొనియాడారు. గ్రామ ప్రజలు చూపిన సహకారం వల్లే బాపన్‌పల్లి గ్రామం ఎస్ఐఆర్ ప్రక్రియను వందశాతం పూర్తి చేయగలిగిందని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ అరాచకం.. ప్రధాని నివాసం వద్ద అరాచకమూక





నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 22 (జనంసాక్షి): కాంగ్రెస్ పార్టీ దేశంలో అరాచకం సృష్టిస్తున్నదని బిజెపి రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ, కే.రతంగ్ పాండురెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ నివాసం వద్ద అరాచక ముఖంగా వ్యవహరించి రాష్ట్రంలో శాంతి యుతం గా నిరసన తెలుపుతున్న తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచం దర్ రావు ఇతర బిజెపి నాయకులను అరెస్ట్ చేయ దం అత్యంత హేయమైన చర్య అని బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావు నామాజి గారు రతంగ్ పాండురెడ్డి తీవ్రంగా ఖండిం చారు.ఇది ముమ్మాటికీ రేవంత్ రెడ్డి ప్రభుత్వ పిరి కిపంద చర్య. ఒకవైపు ఢిల్లీ లో ప్రజాస్వామ్యం ముసుగులో విధ్వంసాలు సృష్టి స్తూ, రాష్ట్రంలో మాత్రం పోలీసుల అండతో ప్రతిప క్షాల గొంతు నొక్కాలని చూడటం కాంగ్రెస్ పార్టీ నియంతృత్వానికి, ద్వంద్వ వైఖరికి నిదర్శనం అన్నారు. పోలీసు నిర్బంధాలతో, అక్రమ అరెస్టులతో బిజెపి నాయకులను, కార్యకర్తలను ఎవరూ భయపెట్ట లేరని, కాంగ్రెస్ అప్రజాస్వామిక, అరాచక విధానాలపై బిజెపి పోరాటం ఆగదు అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతా రని హెచ్చరించారు.

# ముగిసిన ఇంటిగ్రేటెడ్ ఇన్-సర్వీస్ టీచర్స్ శిక్షణ



మల్లకల్, జూలై 22 (జనంసాక్షి): మండల కేంద్రంలో ఈనెల20నుండి 22వరకు నిర్వహించిన మొదటి విడత ఇంటిగ్రేటెడ్ ఇన్-సర్వీస్ టీచర్స్ ట్రైనింగ్ శిక్షణ బుధవారం ముగిసింది.మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణలో మండలంలోని ఎస్‌జీటీ ఉపాధ్యాయులు పాల్గొని, నూతన బోధనా విధానాలు, విద్యార్థి కేంద్రిత అభ్యాసం, సమర్థవంతమైన తరగతి గది నిర్వహణ, నిరంతర సమగ్ర మూల్యాంకనం, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ సాంకేతి కత వినియోగం,కార్యాచరణ ఆధారిత బోధన,సమ్మిళిత విద్య తదితర అంశాలపై శిక్షణ పొందారు. శిక్షణ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్స్ సీతంనాయుడు, సుంకన్న, నాగరాజు,కిషోర్ కుమార్, డి.ఆర్.పీ. శ్రీ ఆంజనేయులు తమ అనుభవాలను పంచుకుంటూ ఉపాధ్యాయులకు సమగ్ర శిక్షణ అందించారు.మండల విద్యాశాఖ అధికారిజి. సురేష్ హాజరై ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదలకు ఈ శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఉపాధ్య యులు నిరంతరం నవీన బోధనా పద్ధతులను అవలంబిస్తూ విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా చూసినందుకు ఉపాధ్యాయులను అభినందించారు.

## రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీల

# అరెస్టులపై కల్వకుర్తిలో కాంగ్రెస్ ధర్నా

- కేంద్ర ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ మహబూబ్నగర్ చౌరస్తాలో నిరసన

కల్వకుర్తి,జూలై 22 (జనంసాక్షి): ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీల అరెస్టును నిరసిస్తూ కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను ఖండిస్తూ నాయకులు,కార్యకర్తలు నినాదాలు చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్,డీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య హక్కులను హరిస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కే చర్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, కల్వకుర్తి మండల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, మండల,పట్టణ కాంగ్రెస్ నాయకులు,అనుబంధ సంఘాల నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, ఫ్లోర్ పర్సన్ శ్రీకాంత్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు,కల్వకుర్తి మండల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు,యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్, సేవాదళ్ నాయకులు తదితరులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# వర్షాలకు కూలిన ఇళ్లు



అయిజ, జూలై 22 (జనంసాక్షి): అయిజ మండలం తూముకుంట గ్రామంలో గత మూడు రోజులుగా వర్షాలు కురవడం వల్ల గ్రామంలో రెండు మట్టిళ్లు కూలిపోవడంతో నిరాశ్రయులైన్నారు. ఇరు కుటుంబాలు వ్యవసాయ కూలీలు కావడంతో, వారి పరిస్థితి దయనీయంగా ఉందని, గ్రామ ప్రజలు తెలిపారు. ఈ విషయంపై గ్రామ సర్పంచ్ కృష్ణవర్ధన్ రెడ్డి కూలిపోయిన ఇంటిని సందర్శించారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఇళ్లు పడిపోయిన బాధితులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలనివారు కోరారు.

## దోమల

# నివారణకు ఆయిల్ బాల్స్‌తో చెక్



నారాయణపేట, జూలై 22 (జనంసాక్షి): వర్షకాలం సీజనల్ వ్యాధుల నివారణ చర్యల్లో భాగంగా నారాయణపేట మండలం, సింగారం గ్రామంలో బుధవారం పంచాయతీ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. మురికి కాలువల్లో, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా తయారు చేసిన ఆయిల్ బాల్స్ ను వేశారు. చెక్క పొట్టును గుడ్డలో బంతి మాదిరిగా చుట్టి వాహనాల్లో వాడి పారవేసిన ఇంజిన్ ఆయిల్‌లో ఒకరోజు పాటు నానబెట్టిన అనంతరం వివిధ మురికి నీరు నిల్వ ప్రాంతాల్లో విసిరి వేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో సుమారు 800 వందలకు పైగా ఆయిల్ బాల్స్ ను సిబ్బంది తయారు చేశారు. దోమల గ్రుడ్డు లార్వా దశలో ఆయిల్ బాల్స్ వల్ల ఆక్సిజన్ అందక నశిస్తాయని, దీంతో చాలా వరకు దోమల నివారణ సాధ్యమవుతుందని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు.

## జడ్చర్లలో ముమ్మరంగా ఎస్ఐఆర్ ప్రక్రియ

- ఆగస్టు 3 నాటికి వంద శాతం డిజిటైజేషన్ లక్ష్యం
- రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ



జడ్చర్ల, జూలై 22 (జనంసాక్షి): జడ్చర్ల నియోజకవర్గంలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం వేగంగా పురోగమిస్తోందని ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ), రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ తెలిపారు. బుధవారం జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఇప్పటివరకు నియోజకవర్గంలో 83.74 శాతం డిజిటైజేషన్ పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన ప్రక్రియను రాబోయే ఆగస్టు 3వ తేదీలోపు పూర్తిగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో జడ్చర్ల తహసీల్దార్, సహాయ ఎన్నికల నమోదు అధికారి (ఏఈఆర్ఓ) నర్సింగ్ రావు, జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ గిరీష్, అదనపు తహసీల్దార్, జడ్చర్ల డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) 75-జడ్చర్ల నియోజకవర్గ ఎన్నికల డీటీ మహబూబ్ అలీ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీసీనీ ప్రభుత్వంలో విలీనమే లక్ష్యం

- రాష్ట్ర వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్, గౌరవ అధ్యక్షుడు తోపాజీ అనంత కిషన్
- టీజేఎంయు సర్వసభ్య సమావేశం



సంగారెడ్డి, జూలై 22 (జనంసాక్షి): తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎంయు) ఆధ్వర్యంలో బుధవారం మెదక్ రీజియన్ సర్వసభ్య సమావేశం సంగారెడ్డిలో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్, గౌరవ అధ్యక్షుడు తోపాజీ అనంత కిషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆర్టీసీని పూర్తిగా ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల హోదా కల్పించాలనే డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. గతంలో అధికారంలో ఉన్న యూనియన్లు కార్మికుల సమస్యలు పరిష్కరించలేదని విమర్శించారు. రానున్న ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో టీజేఎంయు మద్దతు ఇవ్వాలని కార్మికులను కోరారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా, డిపోస్థాయి నాయకులతో పాటు వివిధ డిపోల కార్మికులు, మహిళా సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఖానాపూర్‌లో

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ 100 శాతం పూర్తి



నంగునూర్, జూలై 22 (జనంసాక్షి): సిద్దిపేట జిల్లా, నంగునూరు మండలం, ఖానాపూర్ గ్రామంలో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేసినట్లు గ్రామ సర్పంచ్ బల్ల మల్లేశం తెలిపారు. గ్రామంలోని మొత్తం 1035 మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేసి, బీఎల్ఓ రేణుక ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్, మరియు పాలకవర్గ సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది,పంచాయతీ కార్యదర్శి నాగరాజు, జిపిఓ ఆంజనేయులు సహకారంతో డిజిటలైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆమె పేర్కొన్నారు. అలాగే, గ్రామంలో షిఫ్టెడ్ 45, మరణించిన వారివి 27, డబుల్ ఓట్లు 6,ఓటరు జాబితా నుండి తొలగించినట్టు తెలిపారు.ప్రజల సహకారంతో ఈ ప్రక్రియ సజావుగా పూర్తైందని, ఇందుకు సహకరించిన బీఎల్ఓ రేణుక, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలకు సర్పంచ్ బల్ల మల్లేశం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి



ధన్వాడ, జూలై 22 (జనంసాక్షి): భారతీయ జనతా పార్టీ మరియు భారతీయ జనతా యువ మోర్చా ధన్వాడ మండల శాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇల్లు అర్హులందరికీ ఇవ్వాలని బుధవారం నాడు ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. తదుపరి అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని మెమోరాండం ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శివరాజు సీనియర్ నాయకులు పంది రామచంద్రయ్య, ఉదయభాను, కిషన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు గోవర్ధన్ గౌడ్, ఓ బి సి మోర్చా నారాయణపేట జిల్లా అధ్యక్షులు మాకం సురేందర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సుంకు ఉమేష్ కుమార్, శ్రీనివాసులు గౌడ్, కొండయ్య, బీజేవైఎం మండల అధ్యక్షులు కురుమూర్తి యాదవ్, చక్రి, చరణ్ దాస్, వెంకటేష్, జగదీష్, రామకృష్ణ, కృష్ణ, శ్రీకాంత్, మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతం చేయండి

**పోచమ్మ గడ్డ తండా సర్పంచ్ : మహిపాల్ నాయక్**



**వెల్దండ, జూలై 22 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని పోచమ్మ గడ్డ తండా గ్రామపంచాయతీలో కామినేని హాస్పిటల్ ఎల్బీనగర్ వారి సహకారంతో జూన్ 23 గురువారం నిర్వహిస్తున్నట్లు పోచమ్మ గడ్డ తండా గ్రామ సర్పంచ్ మహిపాల్ నాయక్, కామినేని హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ కే దేవేందర్ గౌడ్, డాక్టర్ సాత్వికలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అను భవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో బిపి,షుగర్, కంటికి సంబంధించిన పరీక్షలు, జ్వరం,జలుబు, బలానికి,నొప్పులకు సంబంధించిన మందులను ఉచితంగా అందజేస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరానికి వచ్చేటప్పుడు విధిగా అందరూ ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నెంబర్ తో సంప్రదించి, గ్రామ ప్రజలందరూ ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని సర్పంచ్ కోరారు.

## ఎస్ఎఫ్ఐ జీపు యాత్ర విజయవంతం

- విద్యా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



**జడ్చర్ల, జూలై 22 (జనంసాక్షి):** విద్యారంగ పరిరక్షణ, హాస్టళ్ల పటిష్టత కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన జీపు యాత్ర 2వ రోజు బుధవారం జడ్చర్లలో విజయవంతమైంది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనాథ్, భరత్ ఆధ్వర్యంలో డిగ్రీ మహిళా హాస్టల్, డిగ్రీ, ఇంటర్ కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. బాదేపల్లి హైస్కూల్, జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయులు, లెక్చరర్ల కొరత తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా హాస్టల్‌లో తాగునీరు, గీజర్లు, కాంపౌండ్ వాల్, దోమల నివారణ, కిటికీల మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. డిగ్రీ కళాశాలలో మౌలిక వసతులు కల్పించి, గ్రౌండ్ పనులు పూర్తి చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలి...

- ప్రత్యామ్నాయ కార్యాచరణ పై గ్రామ సభల ద్వారా ప్రజలకు అవగాహన
- జిల్లా మహిళా, సంక్షేమ అధికారి సునంద



**ఇటిక్యాల, జూలై 22 (జనంసాక్షి) :** ఎల్ నినో ప్రభావంతో జూలై నెల ముగుస్తున్న వర్షపాతం తక్కువగా నమోదయిందని, ప్రాజెక్టుల్లో నీటి మట్టం తక్కువగా ఉండడంతో రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా మహిళా సంక్షేమ అధికారి, మండల ప్రత్యేక అధికారి సునంద అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రమాదేవి అధ్యక్షతన అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఖరీఫ్ సీజన్లో రైతులు సాగు చేసే వరి పంటకు బదులు వ్యవసాయ బావులు. బోర్ల కింద ఆరుతడి పంటల సాగు పై దృష్టి పెట్టాలన్నారు. ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని బిఎల్వోలు దృష్టి సారించి సకాలంలో ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ పత్రాలను సేకరించి పూర్తి చేయాలని తాహ సిల్దార్ శ్రీకాంత్ రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వీబీజీ రాంజీ పథకం ద్వారా గ్రామాలలో ఇళ్ళ ముందు ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో విద్యుత్ సమస్య తలెత్తకుండా చూసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు.అదేవిధంగా వైద్య ఆరోగ్యశాఖ. పశువైద్య శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న చేపట్టాల్సిన పనుల ప్రగతిపై డాక్టర్లు రాధిక. భువనేశ్వరి మండల స్థాయి అధికారుల సమావేశంలో వివరించారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా నమోదు కావడంతో ఆరుతడి పంటల సాగు. ఆయిల్ పామ్ పంటల సాగు పై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి రవికుమార్ వివరించారు. ఈ సమావేశంలో ఎంపీవో సునీల్. సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు. ఏఈఓ లు పాల్గొన్నారు.

## షాప్ టూ షాప్ కార్యక్రమాన్ని చేపట్టిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్

- వినియోగదారుల చెంతకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి... • అందర్నీ ఆకట్టుకున్న షాప్ టూ షాప్ కార్యక్రమం • నారాయణపేట బ్రాంచి నుంచి అందించే వివిధ పథకాలను వివరించిన బ్రాంచి మేనేజర్ బి.నర్సప్ప...



**నారాయణపేట,జూలై 22(జనంసాక్షి):** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మహబూబ్‌నగర్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో "షాప్ టూ షాప్ "వినియోగదారుల సేవా కార్యక్రమాన్ని బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి మేనేజర్ బి.నర్సప్ప తమ సిబ్బందితో కలిసి నిర్వహించారు.యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మహబూబ్‌నగర్ ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని అన్ని శాఖలు కస్టమర్ సర్వీస్ ఎక్సలెన్స్ కార్యక్రమంలో భాగంగా షాప్ టు షాప్ వినియోగదారుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు బ్రాంచి మేనేజర్ తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా వినియోగదారుల అవసరాలను ప్రత్యక్షంగా తెలుసుకొని, వారికి అవసరమైన బ్యాంకింగ్ సేవలు,ఆర్థిక పరిష్కారాలను అందించడం ప్రధాన లక్ష్యంగా చేపట్టబడినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో శాఖలలోని అన్ని కేడర్లకు చెందిన ఉద్యోగులు, శాఖ మేనేజర్లు, అధికారులు, క్లరికల్ సిబ్బంది, సబార్డినేట్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. వ్యాపార సంస్థలు, దుకాణాలను ప్రత్యక్షంగా సందర్శించి, వినియోగదారులతో మమేకమై వారి అవసరాలను తెలుసుకొని తగిన బ్యాంకింగ్ ఉత్పత్తులను ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ బి.నర్సప్ప పరిచయం చేశారు.ఈ సందర్భంగా పొదుపు,కరెంట్ ఖాతాలు,వ్యక్తిగత రుణాలు,గృహ రుణాలు, ఎంఎస్ఎంఈ రుణాలు,వ్యవసాయ రుణాలు, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, బీమా, పెట్టుబడి పథకాలు,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వినియోగదారులకు అవగాహన కల్పించారు. అలాగే సురక్షితమైన, సులభమైన డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలని ఆయన ఖాతాదారులకు ఈ సందర్భంగా ప్రోత్సహించారు.ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని తెలిపారు. వినియోగదారులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ అన్ని కేడర్ల ఉద్యోగులు అంకితభావంతో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రాంతీయ కార్యాలయం అభినందనలు తెలిపింది.

## విద్యార్థులపై లాఠీచార్జ్ దారుణం..మోదీ మౌనం ఎందుకు?

- ప్రశ్నిస్తే విద్యార్థులపై దాడులు చేసి చంపుతారా..
- అంబేద్కర్ గారు రాసిన రాజ్యాంగమా..బిజెపి నరేంద్ర మోడీ
- రాజ్యాంగమా సామాన్యులపై బిజెపి హంకం..
- కొడంగల్‌లో కాంగ్రెస్ ధర్నా..కేంద్ర ప్రభుత్వంపై ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి,విమర్శలు



**మహమ్మదాబాద్,జూలై22(జనంసాక్షి):** ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ఆందోళన చేపట్టారు.ఉమ్మడి గండీడ్ మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెల్లి కొడంగల్‌లోని ధర్నాలో పాల్గొని,డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు.ఈసందర్భంగా పరిగి ఎమ్మెల్యే డా.టి.రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ,విద్యార్థులు తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే లాఠీలతో అణచివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు.ఢిల్లీలో జరిగిన ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వహించడం బాధాకరమని అన్నారు.విద్యార్థులపై లాఠీచార్జ్ జరగడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆరోపించారు.నీట్ పేపర్ లీక్ వ్యవహారంతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని,దీనిపై సమాధానం చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం ఆందోళన చేస్తున్న విద్యార్థులపై బలప్రయోగానికి దిగడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు.విద్యార్థులు ప్రశ్నిస్తే లాఠీలతో కొట్టి ప్రాణాలు తీస్తారా?ఇది డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగమా? లేక నరేంద్ర మోదీ రాజ్యాంగమా? అంటూ కేంద్ర ప్రభుత్వంపై ఎమ్మెల్యే తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.ధర్నాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.నీట్ పేపర్ లీక్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.కార్యక్రమానికి ఉమ్మడి గండీడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,కాంగ్రెస్ శ్రేణులు,వివిధ గ్రామాల సర్పంచులు ధర్నాలో పాల్గొన్నారు.

## రాహుల్ అరెస్టును ఖండిస్తూ కాంగ్రెస్ నిరసన..

- నీట్ లీక్‌పై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్..
- మోదీ దిష్టిబొమ్మ దహనం



**నర్సాపూర్, జూలై 22 (జనంసాక్షి):** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్టును ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నర్సాపూర్‌లో నిరసన నిర్వహించారు. నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి నాయకత్వంలో చేపట్టిన కార్యక్రమంలో ముందుగా చిల్డ్రన్స్ పార్కులోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా నర్సాపూర్ చౌరస్తాకు చేరుకుని ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. నీట్ పేపర్ లీక్‌తో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని, దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.కార్యక్రమంలో ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ వెన్నెల, అన్వేష్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీరాజు యాదవ్, కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేలేఘనపూర్ మండల నేతలతో కంఠారెడ్డి తిరుపతి రెడ్డి చిట్‌చాట్



**హవేలీఘనపూర్ మండలం, జూలై 22 (జనంసాక్షి):** హవేలీఘనపూర్ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకుల తో జిల్లా నాయకులు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి బుధవారం మెదక్ జిల్లా పార్టీ కార్యాలయంలో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని తాజా రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, పార్టీ సంస్థాగత బలోపేతంపై నాయకులతో విస్తృతంగా చర్చించారు. గ్రామాల్లో ప్రజలతో మమేకమై వారి సమస్యలను ఎప్పటికప్పుడు పార్టీ దృష్టికి తీసుకురావాలని నాయకులకు సూచించారు. పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయి లో మరింత విస్తృతంగా నిర్వహిస్తూ, నాయకులు–కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే మండలంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, స్థానిక సమస్యల పరిష్కారానికి సంబంధించిన అంశాలపై నాయకుల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు.

# పేట అసెంబ్లీ ఎస్ఐఆర్ పై ఆర్డీఓ సమీక్ష



**నారాయణపేట, జూలై 22(జనంసాక్షి):** నారాయణపేట నియోజకవర్గానికి సంబంధించిన ప్రత్యేక ఎస్ ఐ ఆర్ కార్యక్రమంపై రెవెన్యూ డివిజనల్ అధికారి రమేష్ అఖిల పక్ష సమావేశం నిర్వహించి బుధవారం సమీక్షించారు. ఈ సమావేశంలో, సర్ కార్యక్ర మం కింద గణన పత్రాల ఆన్‌లైన్ డిజిటలైజేషన్ ప్రస్తుతం పురోగతిలో ఉందని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలి యజేశారు. డిజిటలైజేషన్ ప్రక్రియను సకాలంలో విజయవంతంగా పూర్తి చేయడానికి అన్ని రాజకీ య పార్టీలు పూర్తి సహకా రం అందించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి కోరారు. 73-నారాయణపేట అసెం బ్లీ నియోజకవర్గంలో మొత్తం 2,42,773 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,88,944 దరఖాస్తులు డిజిటలైజ్ చేయబడ్డాయనీ యు ఈ ఎష్లతో కలిపి మొత్తం 84.78 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తయిందన్నారు. ఇంకా 36,944 దరఖాస్తుల పరిశీ లన పెండింగ్‌లో ఉందనీ తెలిపారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# వృత్తి నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలి: ఆర్ఐ విజయ్ భాస్కర్

విధి నిర్వహణలో ఆత్మవిశ్వాసంతో పాటు ఆయుధాల వినియోగంపై పూర్తి అవగాహన, నైపుణ్యం కలిగి ఉండడం అత్యంత అవసరమన్నారు.

ప్రతి పోలీసు సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, పరేడ్, డ్రిల్, ఫైరింగ్, వెపన్ హ్యాండ్లింగ్ వంటి అంశాల్లో నిరంతరం సాధన చేయాలని తెలిపారు. శిక్షణద్వారా అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు.

పోలీసు శాఖలో క్రమశిక్షణ, సమయపాలన, బాధ్యతాయుతమైన విధి నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించడం ద్వారా పోలీసుశాఖపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించవచ్చని అన్నారు. అంతే కాకుండా, చట్టాలపై అవగాహన,ఆధునిక దర్యాప్తు విధానాలు, ప్రజా సంబంధాల మెరుగుదల, ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని కూడా ప్రతి పోలీసు సిబ్బంది పెంపొందించుకోవాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వహణలో సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన పోలీసు సేవలు అందించా లని పిలుపునిచ్చారు. ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో ట్రైనర్ హెడ్ కానిస్టేబుల్ రాములు పోలీ సు సిబ్బందికి డ్రిల్, వెపన్ హ్యాండ్లింగ్, క్రమశిక్షణ, శారీ రక దారుఢ్యం తదితర అంశాలపై శిక్షణ అందిం చారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్సై శిరీష, ట్రైనర్ హెడ్ కానిస్టేబుల్ రాములు, వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వనపర్తి జిల్లాలోని చారిత్రక కట్టడాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



**శ్రీరంగాపూర్, జూలై 22 (జనంసాక్షి):** వనపర్తి జిల్లాలోని చారిత్రక, పురావస్తు ప్రాధాన్యం కలిగిన ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని కోరుతూ వనపర్తి జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ యాదవ్ బుధవారం హైదరాబాద్‌లో పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున్ రావును ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ, వనపర్తి జిల్లాలోని శ్రీరంగాపూర్, సుగూరు, చంద్రగడ్ కోట, పానగల్లు కోట, ఘన్పూర్ కోట వంటి చారిత్రక, పురావస్తు ప్రాధాన్యం కలిగిన ప్రాంతాలు రాష్ట్ర వారసత్వ సంపదకు ప్రతీకలని తెలిపారు. ఈ ప్రాంతాలను గుర్తించి సంరక్షించడంతో పాటు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని కోరినట్లు తెలిపారు. పర్యాటక అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, జిల్లాకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ అంశాలను పురావస్తు శాఖ పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

# ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన

**తెలకపల్లి, జూలై 22, (జనంసాక్షి):** ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో మండల పరిధిలోని జమిస్తాపూర్ గ్రామంలో బుధవారం రైతులకు అవగాహన సదస్సు మండల వ్యవసాయ అధికారి పి.నర్మద నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల కందులు, మినుములు, పెసరతో పాటు కూరగాయల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు సూచించారు.

అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని, పంటల ఎంపిక, సాగు విధానాలపై స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వ్యవసాయ విస్తరణ అధికారి సంతోష్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్య పరిష్కారాని కృషి

- చైర్‌పర్సన్ కొండా శ్వేత



**నారాయణపేట జూలై 22(జనంసాక్షి):** నారాయణపేట పట్టణంలో విద్యుత్ సమస్య పరిష్కారాని కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని శాసన్‌పల్లి రోడ్డులో నూతన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. పట్టణంలోని శాసన్‌పల్లి రోడ్డులో చాలా కాలంగా నెలకొన్న తక్కు వ వోల్టేజ్, తరచూ విద్యుత్ అంతరాయం వంటి సమస్యలను పరిష్క రించేందుకు ఏర్పాటు చేసిన నూతన 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించడం జరిగింద న్నారు. ప్రజలకు నిరంతరా యంగా నాణ్యమైన విద్యు త్ సరఫరా అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు వల్ల శాసన్‌పల్లి రోడ్డులోని స్థానికులకు నెలకొన్న విద్యుత్ సమస్యలు గణనీయంగా తగ్గి, మెరుగైన విద్యుత్ సరఫరా అందు తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఘనంగా జి.ఎల్.ఎం చర్చి సిల్వర్ జూబ్లీ వేడుకలు

- ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



**ఉర్కొండ, జూలై 22, (జనంసాక్షి) ;** ఉర్కొండ మండలం రాచాలపల్లి గ్రామంలోని జి.ఎల్.ఎం చర్చి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు బుధవారం రోజు ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి డాక్టర్ చర్ల కోల లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. చర్చి ఫాదర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు,చర్చి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# పోలీస్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డిఎస్పి



**మల్దకల్, జులై 22 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పోలీస్ స్టేషన్ ను బుధవారం గద్వాల డిఎస్పి మొగిలయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి అనంతరం ఎస్సై గదిలోని రికార్డులను తనిఖీ చేశారు. పోలీసుల పనితీరు, పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు సత్వరమే న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం డిఎస్పి పోలీస్ స్టేషన్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయన వెంట సిఐ టంగుటూరు శీను,స్థానిక ఎస్సై సిబ్బంది తదితరులు ఉన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్యంపై దాడి: కసిరెడ్డి నారాయణరెడ్డి

- కడ్తాలలో కాంగ్రెస్ రాస్తారోకో.. కేంద్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహం

కల్వకుర్తి,జూలై 22 (జనంసాక్షి):లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ కల్వకుర్తినియోజకవర్గంలోని కడ్తాల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నాయకత్వంలో జరిగిన ఈ నిరసనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ప్రజల సమస్యలను ప్రశ్నిస్తూ, హక్కుల కోసం పోరాడుతున్న ప్రతిపక్ష నాయకుల గొంతును అణిచివేయాలనే ప్రయత్నం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా ప్రజలంతా ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమంలో మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు,ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని రాహుల్ గాంధీకి సంఘీభావం ప్రకటించారు.

# రాహుల్, ప్రియాంక అరెస్టుకు వ్యతిరేకంగా గద్వాలలో కాంగ్రెస్ ధర్నా

**గద్వాల, జులై 22 (జనంసాక్షి):** కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టును నిరసిస్తూ గద్వాల పట్టణంలోని వైఎస్సార్ చౌక్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ ధర్నా నిర్వహించాయి. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి నేతృత్వంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బుల్లెద్దుల కురుమన్న, కౌన్సిలర్ నరహరి గౌడు, గోవిందు జిల్లా వ్యాప్తంగా ఉన్న ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ భారీ నిరసన

- నీట్ పేపర్ లీక్‌పై కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్



**మహబూబ్ నగర్ రూరల్ జులై 22(జనం సాక్షి):** ఏఐసీసీ రాహుల్ గాంధీ అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ, దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, ఏఐసీసీ మరియు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు ఈరోజు మహబూబ్‌నగర్ పట్టణంలోని అశోక్ టాకీస్ చౌరస్తా, మహాత్మా గాంధీ విగ్రహం వద్ద జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఆధ్వర్యంలో భారీ శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు ఎ. సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ, ప్రజల తరఫున పోరాడుతున్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని తీవ్రంగా ఖండించారు. దేశ యువత, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసిన నీట్ పేపర్ లీక్ వంటి ఘటనలపై ప్రశ్నించినందుకే రాహుల్ గాంధీ గారిని లక్ష్యంగా చేసుకోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. ప్రజల గొంతును అణచివేయాలని ఎంత ప్రయత్నించినా కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గదని, రాజ్యాంగ పరిరక్షణ, విద్యార్థుల హక్కులు, సామాన్య ప్రజల న్యాయం కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రజాస్వామ్య విలువలను గౌరవించి, నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ , టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎ.పి. మిథున్ రెడ్డి , టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి ,ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ , మహబూబ్‌నగర్ మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ , డిప్యూటీ మేయర్ ఎం. సురేందర్ రెడ్డి , మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం. నర్సింహా రెడ్డి ,ఎస్సీ సెల్ అధ్యక్షులు పసుల రాజు , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, డివిజన్ కాంగ్రెస్ కమిటీ నాయకులు, కార్పొరేటర్లు, ఫ్రంటల్ ఆర్గనైజేషన్స్, సెల్ చైర్మన్లు, అనుబంధ విభాగాల నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.